విశాఖపట్టణం
మంగళవారం 7 ఏప్రిల్ 2026

For a pure tomorrow..

# జయ జయహే

jayajayahey.in సంపుటి: 9 సంచిక: 73 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool




## పిఠాపురం రైల్వే స్టేషన్‌కు మహర్దశ

రూ.37.25 కోట్ల అమృత భారత్ నిధులు మంజూరు

ఫలించిన డిప్యూటీ సీఎం పవన్ ప్రయత్నాలు

2

# ఉద్యోగులకు బంపర్ ఆఫర్

సూపర్ అచీవర్స్, పెర్ఫార్మర్స్.. లెర్నర్స్


పని చేసే వారిని ప్రోత్సహిస్తాం

చేయని వారిని గాడిలో పెడతాం

అధికారులపై కావాలని ఫిర్యాదులు తగదు

సీఎం చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలు

జలధార సభలో కీలక ప్రసంగం






(అనంతపురం - జయజయహే)

అనంతపురం జిల్లా, తాడిపత్రి నియోజకవర్గ ప్రోగ్రెస్ రిపోర్ట్‌ను యాడికి జలధార సభలో చదివి వినిపించిచారు సీఎం చంద్రబాబు. వివిధ శాఖల పనితీరు నివేదికలను ప్రజల ముందు ప్రజెంట్ చేసిన ఆయన సరిగ్గా పనితీరు కనబరచని వివిధ శాఖలకు చెందిన అధికారులను వేదిక మీదకు పిలిపించి వివరణ అడిగారు. పనితీరును మెరుగు పర్చుకోవాలని సూచించారు. అధికారులకు తాము పూర్తిగా సహకరిస్తామని అధికారులు, ఉద్యోగులు కూడా రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని కోరారు. భూవివాదాలనేవి లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారులకు స్పష్టం చేశారు. ప్రజా సంతృప్తే లక్ష్యంగా పని చేయాలని, ప్రజలకు సేవలందించాలని ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు. ట్రాక్టర్లల్లో ఇసుక తీసుకెళ్తున్నప్పుడు ఎవరైనా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారా..? అని ప్రజలనే నేరుగా సభలో అడిగారు సీఎం చంద్రబాబు. ఎవ్వరూ అడ్డుకోవడం లేదని ప్రజలు సమాధానం ఇచ్చారు. ఆదాయం తగ్గినా పర్వాలేదనుకుని ఉచిత ఇసుక విధానం అమలు చేస్తున్నామన్నారు సీఎం. ట్రాక్టర్లల్లో ఇసుక తీసుకెళ్తున్నప్పుడు ఎవరైనా అడ్డుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాగా పని చేసిన అధికారును అభినందించాలంటూ ప్రజలతో చప్పట్లు కొట్టించారు. చక్కగా పని చేసిన వారిని ప్రొత్సహిస్తాం.. ఇంకా పని చేయని వారిని గాడిలో పెట్టేలా చేస్తామన్నారు. అధికారులపై కావాలని ఫిర్యాదులు చేయకుండా.. ..మిగతా 2లో



## రాష్ట్రాభివృద్ధికి 'మావిగన్' మంత్ర

ఓర్చుకోలేకనే డైవర్షన్ పాలిటిక్స్

రెండేళ్లుగా ఉత్తరాంధ్ర, రాయలసీమ ఊసే ఎత్తలేదు

మాజీ మంత్రి కురసాల కన్నబాబు ధ్వజం

(విశాఖపట్నం - జయజయహే)

మచిలీపట్నం, విజయవాడ, గుంటూరుతో కూడిన మావిగన్ ప్రాంతాన్ని ఒక కారిడార్‌గా అభివృద్ధి చేస్తే రాష్ట్రానికి గ్రోత్ ఇంజిన్ అవుతుందని ప్లాన్--బీ గా జగన్ సూచిస్తే అధికార పార్టీ ఒక్కసారిగా ఉలిక్కి పడిందని వైసీపీ విశాఖ రీజనల్ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు విమర్శించారు. వారం రోజులుగా పరిపాలన పూర్తిగా గాలికొదిలేసి మావిగన్‌ను ట్రోల్ చేయడానికి అల్లాడుతున్నారని ఎద్దేవా చేసారు. విశాఖలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వైసీపీ నేతలతో కలసి ఆయన మాట్లాడుతూ, మావిగన్ అనేది వాళ్లకు వేల కోట్ల అవినీతి మీద ఎక్కు పెట్టిన గన్‌లా కనిపించింది. రూ.20 వేల కోట్లతో మావిగన్ ఏరియాను డెవలప్ చేస్తే సరిపోతుందని సూచిస్తుంటే కూటమి నాయకులు ఎందుకు భయపడిపోతున్నారు? అమరావతి కోసం గొప్ప చట్టాన్ని తెచ్చామని చెప్పుకునే మీరంతా ఎందుకు ఆవేశపడిపోతున్నారు? అమరావతిని పూర్తి చేయడానికి తరాలు పడుతుందని మీరే చెబుతున్నప్పుడు త్వరితగతిన పూర్తయ్యే మావిగన్ ఐడియా మంచిదే కదా. అందుకేనా మీలో ఈ భయం? ఎప్పుడూ లేనిది అమరావతి పనులు వేగంగా పూర్తి చేయాలని హడావుడి చేస్తున్నారు. ఏడేళ్ల ..మిగతా 2లో

# పుష్కలంగా ఆహార నిల్వలు

హెచ్చుతగ్గులేమీ లేవు

అదుపులో హోల్ సేల్, రిటైల్ ధరలు

కేంద్ర ప్రభుత్వం స్పష్టీకరణ

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

పశ్చిమాసియా సంక్షోభం కారణంగా దేశంలో నిత్యావసర వస్తువుల ధరల్లో ఎటువంటి అసాధారణ హెచ్చుతగ్గులేమీ లేవని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. దేశవ్యాప్తంగా హోల్‌సేల్, రిటైల్ మార్కెట్లలో ధరలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపింది. ప్రజా పంపిణీ వ్యవస్థ అవసరాలకు, అలాగే ఏవైనా అత్యవసర పరిస్థితులకు సరిపడా గోధుమలు, బియ్యం నిల్వలు తమ వద్ద ఉన్నాయని స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ అదనపు కార్యదర్శి అనుపమ్ మిశ్రా వ్యాఖ్యానించారు. "దేశంలో ఆహార భద్రత పరిస్థితిని వినియోగదారుల వ్యవహారాల శాఖ నిశితంగా గమనిస్తోంది. ఆహార పదార్థాల ధరలను పర్యవేక్షిస్తున్నాం. అలాగే ఆహార పదార్థాల నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్‌ను నిరోధించడానికి కూడా ప్రయత్నాలు చేస్తున్నాం. దేశవ్యాప్తంగా ఉన్న 528 కేంద్రాల నుంచి వినియోగదారుల వ్యవహారాల శాఖ ప్రతిరోజూ 40 రకాల ..మిగతా 2లో







2

## రాష్ట్రపతి భవన్‌కు రాజధాని బిల్లు

చట్టరూపం దాల్చనున్న అమరావతి




కమ్యూనిస్టులు..

## కంట్రీకి నీచులు

స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చేయకపోయినా నిరసనలు

వాళ్లకి మేత అందలేదని పోరాటాలు

బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు వ్యాఖ్యలు

3

## రెండు ప్రాణాలు తీసిన ఒక రన్

క్రికెట్ మ్యాచ్‌లో ఒక్క పరుగు కోసం వాగ్వాదం

ఆగ్రహంతో కత్తితో పొడవడంతో ఓ యువకుడు మృతి

పోలీసుల అదుపులో దాడికి పాల్పడ్డ మరో యువకుడు





(విశాఖపట్నం - జయజయహే)

క్రికెట్ మ్యాచ్ సందర్భంగా చెలరేగిన వివాదం యువకుడి హత్య కు దారి తీసింది. ఒక్క పరుగు కోసం వాగ్వాదం మొదలై సర్దుబాటు జరిగింది. మ్యాచ్ ముగిసినా.. ఆ తరువాత కక్షతో కత్తి దూసాడు ఓ యువకుడు. నడి రోడ్డుపైనే మళ్ళీ గొడవ పెట్టుకుని మరీ దాడి చేసాడు. ఈ ఘటనలో అజిత్ ప్రాణాలు కోల్పోగా.. మరో యువకుడు గాయాలతో ..మిగతా 2లో

## 9 మంది పోలీసులకు ఉరిశిక్ష

2020లో లాకప్ డెత్ ల కేసు

సుమోటోగా తీసుకున్న హైకోర్టు

సీబీఐ విచారణకు అప్పట్లో ఆదేశం

ఇటీవల కోర్టుకు సీబీఐ నివేదిక

నివేదిక మేరకు 9 మందికి శిక్ష

తమిళనాడులోని సాతాంకుళంలో ఘటన



2

## తుపాన్ల గండం

తెలుగు రాష్ట్రాలకు వర్ష సూచన

ఆస్ట్రేలియాలో మైలా, వలను తుపాన్లు


10 వరకు పలు ప్రాంతాల్లో వర్షాలు

మరికొన్ని ప్రాంతాల్లో ఎండల వేడిమి

## తగ్గిన ఉల్లి ధరలు

రూ. 100కే 8కిలోల ఉల్లి విక్రయాలు

ఎగుమతులు నిలిచిపోవడమే కారణం



2

# ఉద్యోగులకు బంపర్ ఆఫర్

మొదటి పేజీ తరువాయి...

పనితీరు ఆధారంగా బేరీజు వేయాలని ప్రజలకు సీఎం సూచించారు. ఉద్యోగుల పనితీరు ఆధారంగా సూపర్ అచీవర్స్.. అచీవర్స్.. పెర్ఫార్మర్స్.. లెర్నర్స్ గా విభజిస్తున్నట్టు ముఖ్యమంత్రి వెల్లడించారు. ఇకపై తాను వచ్చే ప్రతీ సభకు జిల్లా అధికార యంత్రాంగం మొత్తం హాజరవ్వాలని సీఎం అన్నారు. పనితీరు ఆధారంగానే ప్రజా ప్రతినిధులను, రాజకీయ పార్టీలను విశ్లేషించేలా ఆలోచన చేయాలన్నారు సీఎం చంద్రబాబు. మరోవైపు గత ప్రభుత్వంలో వ్యవస్థలు ఏ విధంగా విధ్వంసం జరిగిందో వివరించారు సీఎం చంద్రబాబు. గత పాలకులు మనకు అడ్రస్ లేకుండా చేశారని.. ఇప్పుడు మీ రాజధాని ఏదంటే అమరావతి అని గర్వంగా చెప్పే రోజు వచ్చిందన్నారు. గతంలో మూడు ముక్కలాట ఆడారు. ఇక మనకు ఒక్కటే రాజధాని నగరం అన్నారు. పార్లమెంటులో 50 పార్టీలు ఉంటే అందులో వైసీపీ మినహా 49 పార్టీలు అమరావతికి మద్దతు పలికాయన్నారు. అమరావతి పనులు వేగంగా జరుగుతుంటే.. చూసి సహించలేక ఫ్రస్టేషన్ తో అవినీతి జరిగిందని అంటున్నారని మండిపడ్డారు. 2047 నాటికి ఏపీని అగ్రస్థానంలోకి తీసుకెళ్లే బాధ్యత తీసుకున్నామని.. దీనికి ప్రణాళికలు కూడా సిద్ధం చేశామన్నారు. ఉత్తరాంధ్ర నుంచి పశ్చిమ గోదావరి వరకూ విశాఖ, ప్రకాశం-నెల్లూరు వరకూ అమరావతి, తిరుపతి కేంద్రంగా రాయలసీమ ప్రాంతాల్లో అభివృద్ధి రీజియన్లుగా తయారవుతాయన్నారు.







## ...రాష్ట్రాభివృద్ధికి 'మావిగన్' మంత్ర

...టి పేజీ తరువాయి...

...ధికారంలో ఉండి అమరావతి కోసం కేవలం రూ.8 వేల కోట్లు ఖర్చు ...ప్పుడు, వారు చెప్పిన రూ.2 లక్షల కోట్లు ఖర్చుచేసి లక్ష ఎకరాలు డెవలప్ ...డానికి ఇంకెన్ని దశాబ్ధాలు పడుతుంది అని కన్నబాబు పేర్కొన్నారు. ఇచ్చిన ...లు నెరవేర్చకపోగా కళ్లబొల్లి మాటలు, పబ్లిసిటీతో రెండేళ్లుగా చంద్రబాబు ...పం చేస్తున్నాడు. శివరామకృష్ణన్ కమిటీ ఎక్కడ రాజధాని కట్టకూడదు అని ...చిందో చంద్రబాబు అదే ప్రాంతాన్ని ఎంచుకున్నాడు. రాజధాని పేరుతో వేల ... దోపిడీకి పాల్పడుతున్నాడు. వైయస్ జగన్ గారు ప్రతిపాదించిన మావిగన్ ...ల్‌తో ఆయన అవినీతి ఆశలు కుప్పకూలిపోయే ప్రమాదం ముంచుకొచ్చింది. ...దేయాలో అర్థంకాక వైయస్సార్సీపీ నాయకులను వ్యక్తిత్వ హననం చేస్తున్నారు. ...ల్ని దూషించి రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. అలా డైవర్షన్ పాలిటిక్స్ ...డం ద్వారా విషయాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మాజీ ...ి కురసాల కన్నబాబు ఆక్షేపించారు.

### అమరావతిలో అవినీతికే చట్టబద్ధత తెచ్చారు - గుడివాడ అమర్

జగన్ సూచించిన మావిగన్ పేరుకు వ్యతిరేకమా? లేక మచిలీపట్నం, విజయవాడ, గుంటూరులో రాజధాని ఏర్పాటు చేయడానికి వ్యతిరేకమా? చంద్రబాబు సమాధానం చెప్పాలి. జగన్ గారు సూచించిన మావిగన్ మోడల్‌లో పోర్టు, ఎయిర్‌పోర్టు, నేషనల్ హైవేలు అన్నీ ఉన్నాయి. కానీ అమరావతిలో ఇవన్నీ వేల కోట్లు ఖర్చు చేసి కొత్తగా నిర్మాణం చేసుకోవాల్సిన పరిస్థితి. అమరావతికి చట్ట బద్ధత తీసుకొచ్చామని ప్రచారం చేసుకుంటున్న చంద్రబాబు, దేశంలో ఏ రాష్ట్రానికి ఈ విధంగా చట్టబద్ధత తెచ్చారో చెప్పాలి. చంద్రబాబు తెచ్చిన చట్టబద్ధత అమరావతి రాజధానికి కాదు.. అమరావతి ముసుగులో చేస్తున్న అవినీతికి అని గుడివాడ అమర్ మండిపడ్డారు.

## 9 మంది పోలీసులకు ఉరిశిక్ష

**2020లో లాకప్ డెత్ ల కేసు**

**సుమోటోగా తీసుకున్న హైకోర్టు**

**సీబీఐ విచారణకు అప్పట్లో ఆదేశం**

**ఇటీవల కోర్టుకు సీబీఐ నివేదిక**

**నివేదిక మేరకు 9 మందికి శిక్ష**

**తమిళనాడులోని సాతాంకుళంలో ఘటన**

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

తమిళనాడులో సంచలనం సృష్టించిన సాతాంకుళం కస్టడీ మరణాల కేసులో 9 మంది పోలీసులకు మదురై అదనపు జిల్లా సెషన్స్ కోర్టు ఉరిశిక్ష విధించింది. 2020 జూన్ 19న కరోనా లాక్‌డౌన్ సమయంలో షాప్ ఆలస్యంగా మూసేశారన్న ఆరోపణలతో జయరాజ్, ఆయన కుమారుడు బెనిక్స్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని తీవ్రంగా హింసించారు. పోలీసుల దెబ్బలకు తీవ్రంగా గాయపడిన తండ్రి కొడుకులను హాస్పిటల్‌లో చేర్పించారు. అయితే జూన్ 22న బెనిక్స్, జూన్ 23న జేయరాజ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలీసుల కస్టడీలో తిన్న దెబ్బలకారణంగా ఇద్దరు తండ్రి కొడుకులు చనిపోవడం అప్పుడు దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. దీంతో పోలీసుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమయ్యింది. ఈ ఘటనను మద్రాస్ హైకోర్టు సుమోటోగా తీసుకుని 2020 జూన్ 29న కేసును సీబీఐకి అప్పగించింది. దీంతో రంగంలోకి దిగిన సీబీఐ దాదాపు ఆరు సంవత్సరాల విచారణ తర్వాత కోర్టుకు ఆధారాలను సమర్పించింది. తాజాగా సోమవారం కేసుపై జరిగిన విచారణ సందర్భంగా సీబీఐ ఆధారాలను పరిశీలించిన కోర్టు ఈ కేసులో నిందితులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న 9 మంది పోలీసులను దోషులుగా తేల్చి వారికి ఉరిశిక్ష విధించింది. అయితే కేసులో మొత్తం 10 మంది ఉండగా ఓ నిందితుడు కోవిడ్ కారణంగా 2020లోనే చనిపోయాడు. ఇక ట్రయల్ కోర్టు తీర్పుపై బాధితుల కుటుంబాలు హర్షం వ్యక్తం చేశాయి.

## రెండు ప్రాణాలు తీసిన ఒక రన్

మొదటి పేజీ తరువాయి...

ఆసుపత్రి పాలయ్యాడు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు పోలీసులు. మ్యాచ్ ఆడుతున్న ఇరు జట్లు బాగానే ఉన్నాయి.. కానీ సంబంధం లేని వ్యక్తి.. మ్యాచ్‌లో కలగజేసుకుని వివాదానికి వెళ్లినట్టు పోలీసుల విచారణలో తేలింది. విశాఖ ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధి పెదగదిలి ప్రాంతంలో వీకెండ్ వస్తే చాలు యువకుల సందడే సందడి. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్రికెట్ మ్యాచ్‌లు ఆడుతూ గడుపుతుంటారు. వేర్వేరు జట్లు కూడా అక్కడకు చేరి.. సిరీస్ మాదిరిగా ఒప్పందం గుర్తుకొని పోటాపోటీగా క్రికెట్లో పాల్గొంటారు. ఆదివారం నాడు కూడా.. వినాయక నగర్, చాకలిపేట, పెద్దగదిలి ప్రాంతాలకు చెందిన మూడు జట్లు సిరీస్ ఆడాలని నిర్ణయించుకున్నాయి. అక్కడకు యువకులంతా అక్కడకు చేరుకున్నారు. మూడు జట్లను డ్రా తీశారు పెదగదిలి టీమ్‌కు బై పడింది. వినాయక నగర్, చాకలిపేట టీమ్స్ మధ్య మ్యాచ్.. వారిలో గెలిచిన వాళ్ళు పెదగదిలి జట్టుతో ఆడాల్సి ఉంది. రెండు జట్లు మ్యాచ్ ఆడుతుండగా భయపడిన మూడో జట్టు సభ్యుడు అంపైర్‌గా నిలుచున్నాడు. మ్యాచ్ ఆడుతున్న జట్లలో డోలా అజిత్ అలియాస్ పెద్ద బ్యాటింగ్ చేస్తున్నాడు. అక్కడికి వచ్చిన కిట్టు కిశోర్ అలియాస్ బాక్సర్ కిషోర్.. పక్కన కూర్చొని మ్యాచ్ చూస్తున్నాడు. అజిత్ బ్యాటింగ్ చేస్తుండగా ఒక్క పరుగు విషయంలో ఆటగాళ్లతో వాగ్వాదం జరిగింది. మ్యాచ్ కు అంపైర్‌గా వ్యవహరిస్తున్న చిరంజీవి వివాదాన్ని సర్దుబాటు చేశాడు. ఇదంతా పక్క నుంచి చూస్తున్న గంటా కిషోర్.. అంపైర్ చిరంజీవితో వాగ్వాదానికి దిగాడు. దీనిని అజిత్ ప్రశ్నించడంతో ఇరువర్గాల మధ్య వివాదం రేగింది. ఇంతలో పక్కన ఉన్నవారు సర్దిచెప్పి అక్కడి నుంచి పంపించేశారు.

### మళ్ళీ వివాదం..

అయితే.. కిట్టు కిశోర్ అలియాస్ బాక్సర్ కిషోర్.. భార్యతో కలిసి విశాలక్షినగర్‌లో నివాసముంటున్నాడు. అప్పుడప్పుడు పెదగదిలి వచ్చివెళుతుంటాడు. ఇదిలా ఉండగా మ్యాచ్ సందర్భంగా వివాదం జరిగి సర్దుబాటు జరిగిన తర్వాత ఎవరు ఇళ్లకు వాళ్లు వెళ్లిపోయారు. సాయంత్రం ఆరున్నర గంటల సమయంలో కిషోర్.. విశాలక్షినగర్ నుంచి పెదగదిలి వచ్చాడు. అక్కడ యువకులతో మళ్లీగొడవపడ్డాడు. అదే సమయంలో పక్కనే ఉన్న అజిత్‌పై దాడిచేసి.. తనతోపాటు తెచ్చుకున్న కత్తితో ఛాతిలో పొడిచేశాడు. ఈ హఠాత్పరిణామాన్ని గుర్తించిన అక్కడే ఉన్న మరి కొంతమంది యువకులు వారించే ప్రయత్నం చేశారు. నాగు అనే యువకుడు అడ్డుకునేందుకు యత్నించగా.. అతని పైనా దాడి జరిగి చేతికి గాయమైంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అజిత్ అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. ఆసుపత్రి తరలించే సరికి ప్రాణాలు విడిచాడు. దీంతో ఆ కుటుంబం, స్నేహితులు తీవ్ర విషాదంలోకి వెళ్లారు. గాయపడిన నాగును సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఆరిలోవ పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. నిందితుడు కిషోర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్ మార్చురికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు కిషోర్ ఈవెంట్స్ ఫోటోగ్రాఫర్ అని పోలీసులు తెలిపారు.




## పిఠాపురం రైల్వే స్టేషన్‌కు మహర్ధశ

(అమరావతి - జయజయహే)

కాకినాడ జిల్లా ప్రజలకు గుడ్ న్యూస్. ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కృషి ఫలించింది. పిఠాపురం రైల్వేస్టేషన్‌కి మహర్దశ పట్టింది. డిప్యూటీ సీఎం ప్రయత్నాల మేరకు 'అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్' పరిధిలోకి పిఠాపురం రైల్వేస్టేషన్ చేరింది. ఈ రైల్వేస్టేషన్ పునరుద్ధరణకు కేంద్రం రూ.37.25 కోట్లు కేటాయించింది. త్వరలోనే అభివృద్ధి పనులు చకచకా ప్రారంభం కానున్నాయి. దీంతో పిఠాపురం రైల్వేస్టేషన్ రూపురేఖలు మారనున్నాయి. దీనిపై పిఠాపురం నియోజకవర్గ ప్రజలు, జిల్లా వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటి నుంచో స్టేషన్ మరమ్మతు పనులు పెండింగ్‌లో ఉన్నాయని.. తమ అభిమాన నటుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చొరవతో నేడు సమస్యలు తొలగిపోతున్నాయని హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా, అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ కింద ఎంపిక చేసిన రైల్వేస్టేషన్లను అత్యాధునిక మౌలిక సదుపాయాలతో కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది.



## పుష్కలంగా ఆహార నిల్వలు

మొదటి పేజీ తరువాయి...

వస్తువుల ధరలను పొందుతుంది. హోల్‌సేల్, రిటైల్ ధరలు మొబైల్ యాప్‌లో అప్డేట్ చేస్తున్నాం. ఇప్పటివరకు మేము గమనించిన వరకు నిత్యావసర వస్తువుల ధరల్లో ఎటువంటి అసాధారణ హెచ్చుతగ్గులు లేవు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది పప్పుధాన్యాల ఉత్పత్తి ఎక్కువగా ఉంది. ప్రభుత్వం వద్ద 28 లక్షల టన్నుల పప్పుధాన్యాల బఫర్ స్టాక్ ఉంది. ఉల్లిపాయలు, బంగాళదుంప, టమాటాల ఉత్పత్తి దాదాపు గతేడాది స్థాయిలోనే ఉంది." అని అనుపమ్ మిశ్రా పేర్కొన్నారు. 1955 నాటి నిత్యావసర వస్తువుల చట్టం ప్రకారం, వస్తువుల బ్లాక్ మార్కెటింగ్ లేదా నిల్వలకు వ్యతిరేకంగా చర్యలు తీసుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందని అనుపమ్ మిశ్రా వెల్లడించారు. ఈ విషయంపై తాము రాష్ట్ర ప్రభుత్వాలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు, నిల్వల విషయంలో రాష్ట్రాలతో నిరంతరాయంగా సంప్రదింపులు జరిపేందుకు ఒక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ప్రస్తుత బఫర్ నిబంధనల కంటే మూడు రెట్లు అధికంగా దేశంలో ఆహార ధాన్యాల నిల్వలు ఉన్నాయని కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ సంయుక్త కార్యదర్శి సి. శిఖ తెలిపారు. దేశంలో ప్రస్తుతం సుమారు 222 లక్షల మెట్రిక్ టన్నుల గోధుమలు, దాదాపు 380 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం నిల్వలు ఉన్నాయని వెల్లడించారు. దీంతో మొత్తం ఆహార నిల్వలు సుమారు 602 లక్షల మెట్రిక్ టన్నులకు చేరాయని పేర్కొన్నారు. ఈ నిల్వలు ప్రజా పంపిణీ వ్యవస్థ అవసరాలను, అలాగే ఏవైనా అత్యవసర పరిస్థితులు తలెత్తితే వాటిని తీర్చడానికి సరిపోతాయని వ్యాఖ్యానించారు. "ఇండోనేసియా, మలేసియా, రష్యా, ఉక్రెయిన్, అర్జెంటీనా, బ్రెజిల్ వంటి కీలక భాగస్వాముల నుంచి భారత్‌కు దిగుమతులు నిలకడగా కొనసాగుతున్నాయి. ఇది మొత్తం సరఫరా స్థిరత్వానికి దోహదపడుతోంది. ఆవాలు ఉత్పత్తి మెరుగుపడటం వల్ల, ముఖ్యంగా వంట నూనెల విభాగంలో దేశీయ లభ్యత కూడా బలపడింది." అని స్పష్టం చేశారు.

## తగ్గిన ఉల్లి ధరలు

**రూ. 100కే 8కిలోల ఉల్లి విక్రయాలు**

**ఎగుమతులు నిలిచిపోవడమే కారణం**

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

ఉల్లిపాయలు లేనేది వంటిల్లో ఏ పని జరగదు. ఏ కూర వండాలన్నా ఉల్లి అనేది తప్పనిసరి. ఇవి లేకపోతే ఏ కూరకు టెస్ట్ రాదు. వంటల్లో ఉల్లికి అంతటి ప్రాధాన్యత ఉంది. అందుకే ఉల్లి ధరలు పెరిగితే సామాన్యులందరినీ ప్రభావితం చేస్తోంది. ఉల్లి ధరలు గతంలో కేజీ రూ.100కిపైగా పలికి రికార్డ్ సృష్టించిన రోజులు ఉన్నాయి. అయితే ప్రస్తుతం ఉల్లి ధరలు భారీగా పడిపోయాయి. గల్ఫ్ దేశాల్లో యుద్ధ పరిస్థితుల క్రమంలో ఇక్కడి నుంచి ఎగుమతులు నిలిచిపోయాయి. దీని వల్ల సరఫరా పెరగడంతో ధరలు తగ్గుముఖం పట్టాయి. దీంతో గిట్టుపాటు ధర లేక రైతులు నష్టపోతున్నారు. పంటకు మద్దతు ధర లేక తెలుగు రాష్ట్రాల్లో రైతులు లబోదిబోమంటున్నారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో రూ.100కు 8 కిలోల ఉల్లిపాయలు మార్కెట్లలో ఇస్తున్నారు. ఉమ్మడి మహబూబ్ నగర్‌లో నెల క్రితం క్వింటా ఉల్లి రూ.2 వేలు ఉండగా.. ఇప్పుడు రూ.800 నుంచి 1400కి చేరుకున్నాయి. దీంతో పండించిన పంటకు ధర లేకపోవడంలో రైతులు తీవ్ర నష్టాల పాలవుతున్నారు. ఇక ధర లేకపోవడం, కనీసం ప్రయాణ ఖర్చులకు కూడా సరిపోకపోవడంతో రోడ్ల పక్కన పడేసి వెళ్లిపోతున్నారు. కనీసం పోలం నుంచి మార్కెట్‌కి తరలించేందుకు అయ్యే రవాణా ఖర్చులకు సరిపోయేంత కూడా రావడం లేనది బాధపడుతున్నారు. ఇక ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం వల్ల టమాటా దిగుమతులు కూడా తగ్గిపోయాయి. దీంతో నిల్వ పెరగడం వల్ల వాటి ధరలు కూడా పడిపోయాయి. ప్రస్తుతం కేజీ టమాటా రూ.10కే లభిస్తోంది. టామాటా పంట వేసిన రైతులకు ఆదాయం రాకపోవడంతో నిరాశ చెందుతున్నారు. పశువులకు మేతగా వీటిని వేస్తున్నారు. ట్రాక్టర్లలో తీసుకొచ్చి పశువులకు మేతగా వేసి వెళ్లిపోతున్నాయి. కొంతమంది రోడ్ల పక్కనే పడేసి వెళ్లిపోతున్నారు. యుద్ధం ఎఫెక్ట్ దేశంలోని రైతులపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. దిగుమతులకు ఆటంకం కలగడంతో రైతులకు నష్టం జరుగుతోంది. ధరలు ఇప్పట్లో పెరిగే అవకాశం లేకపోవడంతో ఉల్లి, టమాటా రైతులకు ఈ ఏడాది నష్టాలు తప్పడం లేదు. దీంతో ప్రభుత్వాలు స్పందించి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. కనీసం మద్దతు ధర కూడా పలకడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## రాష్ట్రపతి భవన్‌కు రాజధాని బిల్లు

**చట్టరూపం దాల్చనున్న అమరావతి**

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)



రాజధాని అమరావతి చట్టబద్ధత బిల్లు రాష్ట్రపతి భవన్‌కు చేరుకుంది. పరిశీలన, న్యాయ నిపుణులతో సంప్రదింపుల అనంతరం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలపనున్నారు. రాష్ట్రపతి ఆమోదం అనంతరం ఇది చట్టరూపం దాల్చనుంది. ఏపీ పునర్విభజన చట్ట సవరణ 2026 బిల్లుకు పార్లమెంట్ ఇటీవల ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. పార్లమెంట్ తీర్మానంతో చట్టబద్ధంగా, రాజ్యాంగబద్ధంగా అమరావతికి శాశ్వతంగా దృఢత్వం వచ్చింది. సుమారు 5 గంటల పాటు లోక్‌సభ, రాజ్యసభల్లో బిల్లుపై చర్చలు జరిగాయి. ఎలాంటి సవరణలు లేకుండానే బిల్లుకు ఉభయ సభలు ఆమోదం తెలిపాయి. ఉభయ సభల ఆమోదం తర్వాత లోక్‌సభ సచివాలయం ఈ బిల్లును రాష్ట్రపతి వద్దకు పంపింది. నేడు రాష్ట్రపతి ఆమోద ముద్ర వేసే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. అమరావతి చట్టబద్ధత బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందిన నేపథ్యంలో అమరావతి ప్రాంత ప్రజలు బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

# కమ్యూనిస్టులు.. కంట్రీకి నీచులు

### స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చేయకపోయినా నిరసనలు

### వాళ్లకి మేత అందలేదని పోరాటాలు

### బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు వ్యాఖ్యలు

**(అమరావతి - జయజయహే)**

బిజెపి సీనియర్ నేత, ఎమ్మెల్సీ సోము వీర్రాజు కమ్యూనిస్టులపై చేసిన ఘాటు వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో పెను దుమారం రేపుతున్నాయి. భీమిలిలో బిజెపి పార్టీ నూతన కార్యాలయ ప్రారంభోత్సవం సందర్భంగా నిర్వహించిన ప్రెస్ మీట్‌లో ఆయన కమ్యూనిస్టు పార్టీలను లక్ష్యంగా చేసుకుని విమర్శనాస్త్రాలు సంధించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని అడ్డుపెట్టుకుని కమ్యూనిస్టులు అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నారని, దేశాభివృద్ధికి వారు ఆటంకమని ఆయన మండిపడ్డారు.



ముఖ్యంగా విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలో కేంద్ర ప్రభుత్వం ఎక్కడా ప్రైవేటీకరణ చేస్తామని చెప్పలేదని సోము వీర్రాజు స్పష్టం చేశారు. వాస్తవాలు ఇలా ఉంటే, కేవలం రాజకీయ ఉనికి కోసమే కమ్యూనిస్టు నేతలు నిరాహార దీక్షల పేరుతో డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. కమ్యూనిస్టులకు మేత అందకనే ఇలాంటి దీక్షలు చేస్తున్నారు అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. కమ్యూనిస్టులు దేశానికి నీచులు అంటూ ఆయన వాడటం తీవ్ర వివాదానికి దారితీసింది. గతంలో కూడా వారు అనేక అభివృద్ధి ప్రాజెక్టులను అడ్డుకున్నారని, ఇప్పుడు స్టీల్ ప్లాంట్ కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం స్టీల్ ప్లాంట్‌ను బలోపేతం చేసేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తుంటే, వీరు మాత్రం పనిగట్టుకుని బీజేపీపై బురద జల్లుతున్నారని మండిపడ్డారు. భీమిలి వేదికగా సోము వీర్రాజు చేసిన ఈ వ్యాఖ్యలపై కమ్యూనిస్ట్ పార్టీల నేతలు ఖండిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును అవమానించడమే కాకుండా, బాధ్యతాయుతమైన పదవిలో ఉండి ఇలాంటి భాష వాడటం సరికాదని వారు డిమాండ్ చేస్తున్నారు. స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం తాము చేస్తున్న పోరాటాన్ని అగౌరవపరిస్తే సహించేది లేదని హెచ్చరిస్తున్నారు.




# మన ఊరు మన జెండా స్థూపం

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి :**

తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు పట్టణంలో భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని రంగా వెంకటేశ్వరరావు కళ్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. ఈ సందర్భంగా రంగా వెంకటేశ్వరరావు తన సొంత నిధులతో "మన ఊరు -- మన జెండా" స్తూపాన్ని ఏర్పాటు చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నియోజకవర్గం నలుమూలల నుంచి నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సామాజిక సేవలో భాగంగా రంగా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సుమారు 200 మంది పేద మహిళలు, పురుషులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అదేవిధంగా వృద్ధులు, మహిళలకు ఫ్రూట్స్, అల్పాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సింహాద్రి సత్యనారాయణ, ప్రమోద్ కుమార్, అక్కిన గోపాలకృష్ణ, రంగినీడి గంగాధర్, బూరుగుపల్లి శివరామకృష్ణ, లక్కోజు సాయి, కంటిపూడి శ్రీరామ్ మూర్తి, శ్రీనివాస్, గున్నబత్తుల మూర్తి, బాబీ, రేలంగి వెంకటేశ్వరరావు, తమ్మిరెడ్డి నాగేశ్వరరావు, దేవన వెంకట పాపారావు, ఎస్ మట్లా వెంకట దుర్గారావు, తోరం జయ శ్రీనివాస్, ముదునూరి వెంకట కిషోర్ రాజు తదితరులు పాల్గొన్నారు.



### కోణం పంచాయతీకి

# రీ సర్వే ప్రారంభం చేయాలి

### గిరిజన సంఘం డిమాండ్

**మాడుగుల ఏప్రిల్ 6 జయ జయహే**

చీడికాడ మండలం కోణం పంచాయతీలో రీసెర్వే ప్రారంభించాలని గిరిజన సంఘం కోరుతుంది. ఈ పంచాయతీలో గల 16 గ్రామాల్లో నివసిస్తున్న ప్రజలందరూ వాళ్ళ తాత తండ్రి నుండి భూముల్లో సాగు చేసుకుని జీవన ఉపాధి సాగించుకుంటున్నారని గిరిజన సంఘం మండల నాయకులు ఆర్ దేముడు నాయుడు చెప్పారు. వీళ్లు తాత తండ్రి నుండి ఈ భూములు సాగు చేసుకుని వాళ్ళ పిల్లలు వాళ్ళ పిల్లలు వాళ్ళ తాతలు ముత్తాతలు బతికామని ఈ భూములు సర్వే చేసి మా పేర్లు అడంగల్ లో నమోదు చేసి మాకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు మారిన కోణం పంచాయతీలో ఉన్న ప్రజల బతుకు మారలేదని ఇప్పటికైనా మా బతుకు మారేలా ప్రభుత్వం గుర్తించి రీ సర్వే చేసి మా అందరికీ పట్టాలు ఇవ్వాలని కోరుతున్నారు. చీడికాడ మండలంలో 23 పంచాయతీలు గాను 21 పంచాయతీ రి సర్వేలు చేశారని, కేవలం మా కోణం పంచాయతీ మాత్రమే రీ సర్వే చేయడం లేదన్నారు. గత గవర్నమెంట్లో సర్వే చేస్తామని చెప్పి పుణ్యకాలం పూర్తయిపోయిందని ఆరోపించారు. ఈ గవర్నమెంట్ లో మా అందరికీ న్యాయం జరిగేలా సర్వే చేసి పట్టాలు మాకు ఇవ్వాల్సిందిగా కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ వార్డ్ నెంబర్ ఏ రాంబాబు టిడిపి ఎస్టిఎల్ కమిటీ చైర్మన్ టి కృష్ణారావు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు సిహెచ్ భీమి నాయుడు నూకాలమ్మ రాజలక్ష్మి అప్పలకొండమ్మ తదితరులు పాల్గొన్నారు.



# విద్యుత్ కొత్త లైన్ల పనులు.. కొన్ని గ్రామాలకు కరెంటు నిలిపివేత

**అనకాపల్లి జిల్లా (జయ జయహే)**

నక్కపల్లి మండలం ఆంధ్ర ప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ మంగళవారం ఉదయం 9 గంటలకు నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు 33 / 11 కెవి ఉప్మాక కరెంట్ స్టేషన్ పరిధిలో నక్కపల్లి రూరల్ పీటర్ నందు కొత్త లైన్ వర్క్ జరుగుతున్న కారణంగా విద్యుత్ నిలుప వేయబడును కావున ఈ క్రింద గ్రామాల్లో వారు సహకరించవలసిందిగా కోరుచున్నాము ఉప్మాక పెద్దదినార్ల చిన్న తీనార్ల దొండవాక సిహెచ్ ఎల్ పురం జానకిపేట కాగిత చందనాడ బుచ్చిరాజుపేట ఈ గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని రాజశేఖర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తెలిపారు

# బీజేపీ 47వ ఆవిర్భావ దినోత్సవం

**రాజమండ్రి జయ జయహే ప్రతినిధి :**

భారతీయ జనతా పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు రాజమండ్రిలో ఘనంగా నిర్వహించారు . జిల్లా బీజేపీ అధ్యక్షులు పిక్కి నాగేంద్ర ఆధ్వర్యంలో జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి హాజరై పార్టీ జెండా ఎగురవేసి జాతీయ గీతాన్ని ఆలపించారు. తదుపరి ఎంపీ పురందేశ్వరి, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కార్యాలయం నుండి ర్యాలీగా బయలుదేరి వై జంక్షన్, అశోక థియేటర్, చర్చ్ ముగ్గుపేట ప్రాంతాల మీదుగా ప్రయాణించి మాజీ ప్రధాని అటల్ బిహారి వాజపేయి విగ్రహం వద్దకు చేరుకుని ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ, బీజేపీ స్థాపించి 46 సంవత్సరాలు పూర్తి చేసుకుని 47వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా పార్టీ మహనీయుల త్యాగాలను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 1980లో జనసంఘ్ నుండి బీజేపీ రాజకీయ శక్తిగా అవతరించిన విషయాన్ని గుర్తు చేశారు. అంకితభావంతో పనిచేసిన కార్యకర్తలు, నాయకుల సేవలను స్మరించుకుంటూ తిరిగి పార్టీ సేవకు అంకితం కావాల్సిన సమయమని



పిలుపునిచ్చారు. పార్టీ ఆరంభ దశలో తీసుకున్న సిద్ధాంతాలను మరవకుండా నేటికీ అదే దృఢ నిబద్ధతతో ముందుకు సాగుతోందని తెలిపారు. అలాగే కేంద్ర ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయాలను ప్రస్తావిస్తూ, జమ్మూ కాశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాక్ రద్దు వంటి సంస్కరణలను ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో అమలు చేసినట్లు చెప్పారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి అంతోదయ సిద్ధాంతంతో కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్డీఏ ప్రభుత్వం పేదల సంక్షేమం దిశగా అనేక పథకాలు అమలు చేస్తోందని, ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే



లక్ష్యంగా పనిచేస్తోందని వివరించారు. బీజేపీ ఓట్ల రాజకీయాలకు అతీతంగా దేశ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రజా రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించినందుకు ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.



# తుపాన్ల గండం

### తెలుగు రాష్ట్రాలకు వర్ష సూచన

### ఆస్ట్రేలియాలో మైలా, వలను తుపాన్లు

### 10 వరకు పలు ప్రాంతాల్లో వర్షాలు

### మరికొన్ని ప్రాంతాల్లో ఎండల వేడిమి

**(అమరావతి - జయజయహే)**

తెలుగు రాష్ట్రాల్లో రానున్న ఐదు రోజుల పాటు వాతావరణం భిన్నంగా ఉండబోతోంది. తుఫాన్లు, వాయుగుండం ప్రభావంతో కొన్ని చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండగా, మరికొన్ని చోట్ల భానుడి ప్రతాపం కొనసాగుతుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. వాతావరణశాఖ అధికారుల ప్రకారం.. ఆస్ట్రేలియా సమీపంలో 'మైలా', 'వలను' అనే రెండు తుఫాన్లు ఏర్పడ్డాయి. తుఫాన్లతో పాటు హిందూ మహాసముద్రంలో కొనసాగుతున్న 'ఇందుసా' వాయుగుండం ప్రభావంతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. దీనికి తోడు అరేబియా సముద్రం నుంచి బంగాళాఖాతం వరకు ఉపరితల ద్రోణి ఏర్పడటంతో ఏప్రిల్ 6 నుండి 10వ తేదీ వరకు ఏపీ, తెలంగాణల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఏప్రిల్ 6 మధ్యాహ్నం తర్వాత ఉత్తరాంధ్ర నుంచి కోస్తాంధ్ర వరకు భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. వర్షంతో పాటు పిడుగులుకూడా పడే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ చేశారు. దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇక రాయలసీమలో ఎండ ప్రభావం తీవ్రంగా ఉంటుందని, ఉష్ణోగ్రతలు అధిక స్థాయిలో నమోదవుతాయని స్పష్టం చేశారు. 39 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్తలు పాటించాలని వాతావరణశాఖ అధికారులు సూచించారు. వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఇటు తెలంగాణలోనూ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ వెల్లడించింది. ఉత్తర తెలంగాణలో ఉదయం నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని, సాయంత్రం వేళ ఖమ్మం పరిసర ప్రాంతాల్లో వర్షాలు కురుస్తాయని, 26 కి.మీ వేగంతో ఈదురుగాలులు కూడా వీస్తాయని తెలిపింది. హైదరాబాద్, దక్షిణ తెలంగాణలో ఎండ తీవ్రత కొనసాగుతుందని, గరిష్టంగా 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యే ఛాన్స్ ఉందని పేర్కొంది. రానున్న రోజుల్లో ఎండలు మరింత ముదిరే అవకాశం ఉన్నందున మధ్యాహ్నం పూట అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని వాతావరణ శాఖ సూచించింది. ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు, గర్భిణీలు ఎండ ప్రభావానికి గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించింది.ం




# హాక్ థన్ ఓపెన్ ఇన్నోవేషన్‌లో లెండి కాలేజీ విద్యార్థుల ప్రతిభ

**విజయనగరం (జయ జయహే)**

సృజన 2026 అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ మరియు ఆంధ్రప్రదేశ్ టెక్నికల్ సెల్ (సావిష్కార్) ఆధ్వర్యంలో నిర్వహించిన మూడు రోజుల హాక్ థన్ ఓపెన్ ఇన్నోవేషన్ లో విజయనగరం లెండి కాలేజ్ విద్యార్థులు ధనుష్, చాందిని,దీక్షిత, ప్రసన్న లు 2 వ ప్రైజ్ గెలిచారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సాయికుమార్, లెండి కళాశాల ప్రిన్సిపాల్ రామరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ అంజిరెడ్డి విద్యార్థులను సత్కరించారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా 800 పైగా ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారని , సృజన 2026 విజయవంతంగా పూర్తయింది డా. హర ప్రసాద్, సృజన వాలెడిక్టరీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. వికసిత భారత్ 2047 సాధనలో సాంకేతికత మరియు విద్యార్థుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. భారత్‌ను విశ్వ గురుగా తీర్చిదిద్దడంలో ఆత్మనిర్భరత అవసరమని, ఆపరేషన్ సింధూర్ వంటి ఉదాహరణలతో దేశం స్వయం సమృద్ధి దిశగా ముందుకు సాగుతోందని తెలిపారు.



# నూతన సివిల్ జడ్జిని అభినందించిన ఎమ్మెల్యే

**మాడుగుల మార్చి 6 జయ జయహే**

మాడుగుల నియోజకవర్గ పరిధిలో గల కే కోటపాడు మండలం ఏ కోడూరు గ్రామానికి చెందిన కోట్యాడ శ్యామల ఇటీవల జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైంది. దీంతో సోమవారం మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఏ కోడూరులో గల ఆమె నివాసానికి వెళ్లి శ్యామలను అభినందించి సాలువుతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతం నుంచి ఒక మహిళ సివిల్ జడ్జిగా ఎంపీ కావడం అభినందనీయమని ప్రశంసించారు. అలాగే కేక్ కోటపాడు వాసవి క్లబ్ తరఫున కూడా సివిల్ జడ్జ్ వాసవిని ఘనంగా సత్కరించే అభినందించారు. ఏ కోడూర్ గ్రామానికి చెందిన గ్రామ పెద్దలు స్థానికులు అభినందించారు.

For a pure tomorrow..
జయహో



పట్టు మహాదేవి

## కోనేరు అభివృద్ధికి 6 కోట్లతో ప్రణాళిక

### అందమైన ఆధునిక ఉద్యాన ప్రాంగణంగా ముస్తాబు

### సుందరమైన వాకర్స్ ట్రాక్ కు కార్యాచరణ లు

### రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చం నాయుడు గ్రీన్ సిగ్నల్

**టెక్కలి ఏప్రిల్ 6 జయ జయహే**

అభివృద్ధి పథంలో టెక్కలి ప్రాంతాన్ని తీర్చిదిద్దేందుకు కంకణం కట్టుకున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చం నాయుడు ప్రగతిని పరుగులు పెట్టే విధంగా ప్రజలం గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచిపోయే వినూత్న కార్యాచరణ కు నిర్మితాలకు కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టడం ప్రజలు హర్షిస్తున్నారు. టెక్కలి పట్టణంలో తరాల నుంచి మురికి కోనేరుగా మిగిలిన పట్టు మహాదేవి కోనేరును ఆరు కోట్ల రూపాయల వ్యయంతో ఆధునిక సుందరీకరణకు స్థానికులు ,అధికారుల సమన్వయంతో పక్కా ప్రణాళిక సిద్ధం చేసి ఎలాంటి నాణ్యత లోపాలు లేకుండా పట్టుమహాదేవి కోనేరు పరిసర ప్రాంతాలను సుందర ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చం నాయుడు అధికారులకు ఆదేశించారు. ఈ కోనేరు చుట్టూ విశాలమైన ప్రహరీ రక్షణ గోడ, వాకర్స్ ఆనందంగా సంతోషంగా నడిచి తమ ఆరోగ్యాలను కాపాడుకునేందుకు అవసరమైన భార్యతో పాటు అందమైన పూల నందనవనం తయారీ కి కార్యాచరణ జరిగింది, కోనేరు చుట్టూ ఆహ్లాదకరమైన వాతావరణం విద్యుత్తు, విశ్రాంతి వినోదం, ఉల్లాసం కలిగేలా పట్టు మహాదేవి కోనేరు చుట్టూ పార్క్ తయారుకు ప్లాను సిద్ధమైంది, ఈ కోనేరు అభివృద్ధి గూర్చి అధికారులు, స్థానిక నేతలతో మంత్రి కింజరాపు అచ్చం నాయుడు సమీక్ష సమావేశంలో పరిపూర్ణమైన ఆదేశాలు సూచనలు ఇచ్చి ప్రజలకు నూతన ఉత్తేజాన్ని కలిగేలా పట్టు మహా దేవి కోనేరు మహత్తర అభివృద్ధికి గ్రీన్ సిగ్నల్ తెలియజేశారు . ఆయనతోపాటు పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరి వరప్రసాద్, టెక్కలి ఆర్డిఓ ఎం కృష్ణమూర్తి, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజారోగ్యంపై పటిష్ట ప్రణాళిక

(సి.హెచ్.ప్రతాప్)

**ఆరోగ్యవంతమైన పౌరులే ఏ దేశానికైనా అసలైన సంపద మరియు శక్తికి మూలాధారం. అయితే ప్రస్తుత కాలంలో వయసుతో నిమిత్తం లేకుండా అనేక రకాల వ్యాధులు ప్రజలపై దాడి చేస్తుండటంతో ఆ పునాది బలహీనపడుతోంది. వైద్య విజ్ఞానం పెరగడం వల్ల సగటు ఆయుర్దాయం పెరిగినప్పటికీ, నాణ్యమైన మరియు రోగరహితమైన జీవనశైలి మాత్రం కరువవుతోంది. ఖరీదైన వైద్య చికిత్సలు, శస్త్రచికిత్సల భారం పెరగడం వల్ల సామాన్యుల ఆర్థిక స్థితిగతులు తలకిందులవుతున్నాయి. కేవలం మనుషుల ఆరోగ్యంపైనే కాకుండా అడవులు, వన్యప్రాణులు మరియు పర్యావరణ సమతుల్యతను కాపాడినప్పుడే మానవాళికి సంపూర్ణ రక్షణ లభిస్తుంది.**

ప్రజారోగ్యానికి ప్రధానంగా నాలుగు మార్గాల్లో ముప్పు పొంచి ఉంది. అవి అంటువ్యాధులు, దీర్ఘకాలిక వ్యాధులు, జన్యుపరమైన వైకల్యాలు మరియు వృద్ధాప్య సంబంధిత క్షీణత వ్యాధులు. వీటిని సరైన అవగాహన మరియు ముందస్తు జాగ్రత్తలతో సమర్థవంతంగా ఎదుర్కోవచ్చు.





భారతదేశంలో నేటికీ బ్యాక్టీరియా, వైరస్ మరియు శిలీంధ్రాల వల్ల కలిగే ఇన్ఫెక్షన్లు ఆందోళన కలిగిస్తున్నాయి. మలేరియా, టైఫాయిడ్, క్షయ వంటి వ్యాధులు ఒకవైపు, కొవిడ్-19, డెంగ్యూ, ఎన్సెఫాలిటిస్ వంటి వైరల్ వ్యాధులు మరోవైపు ప్రజలను పీడిస్తున్నాయి. హెచ్.ఐ.వి మరియు హెపటైటిస్ వంటి ప్రాణాంతక ఇన్ఫెక్షన్ల వ్యాప్తి కూడా పెరగడం గమనార్హం. అనేక వ్యాధులకు చికిత్స అందుబాటులో ఉన్నప్పటికీ, మరణాలు సంభవిస్తుండటం మన ఆరోగ్య వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపుతోంది.

దీనికి తోడు చక్కెర వ్యాధి, రక్తపోటు మరియు క్యాన్సర్ వంటి జీవనశైలి వ్యాధులు దేశవ్యాప్తంగా మహమ్మారిలా విస్తరిస్తున్నాయి. ఇవి మనిషిని శారీరకంగానే కాకుండా, జీవితాంతం మందులు వాడాల్సి రావడం వల్ల ఆర్థికంగా కూడా కృంగదీస్తున్నాయి. వాతావరణ మార్పులు, కలుషితమైన తాగునీరు, ఆహార కల్తీ వంటివి ఈ పరిస్థితిని మరింత జటిలం చేస్తున్నాయి. రసాయన ఎరువులు మరియు పురుగుల మందుల మితిమీరిన వాడకం వల్ల పండించే ఆహారం విషతుల్యమవుతోంది. శారీరక శ్రమ లేకపోవడం, మితిమీరిన మానసిక ఒత్తిడి వల్ల చిన్న వయసులోనే గుండె జబ్బుల బారిన పడుతున్నారు. మరోవైపు, అరుదైన జన్యు వ్యాధుల చికిత్సకు అయ్యే కోట్లాది రూపాయల ఖర్చు సగటు కుటుంబాలకు అందనంత దూరంలో ఉంది.


ప్రభుత్వ ఆసుపత్రులలో మౌలిక సదుపాయాల కొరత, నిపుణులైన వైద్యులు లేకపోవడం మరియు మందుల కొరత వంటివి ఆరోగ్య రంగాన్ని వేధిస్తున్న ప్రధాన సమస్యలు. ప్రైవేట్ వైద్యం పూర్తిగా వ్యాపారీకరణ చెందడంతో సామాన్యులకు భారం అవుతోంది. బీమా సౌకర్యాలు ఉన్నప్పటికీ, అవి అన్ని సందర్భాల్లోనూ ఆదుకోలేకపోతున్నాయి. ఆరోగ్య రంగంపై ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపులు పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలను బలోపేతం చేయడం ద్వారానే ఆరోగ్య భారత నిర్మాణం సాధ్యమవుతుంది.

ప్రజారోగ్యం మెరుగుపడాలంటే ప్రభుత్వం మరియు ప్రజల మధ్య సమన్వయం ఉండాలి. వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహారం మరియు వ్యాయామంపై అవగాహన పెంచుకోవాలి. పాఠశాల స్థాయి నుంచే ఆరోగ్య సూత్రాలను బోధించాలి. కల్తీని అరికట్టడం, పర్యావరణాన్ని రక్షించడం వంటి కఠిన నిర్ణయాలను ప్రభుత్వాలు తీసుకోవాలి. ప్రజారోగ్యం అనేది ఒక్కరి బాధ్యత కాదు, అది ఒక సామాజిక యజ్ఞం. శాస్త్ర సాంకేతిక రంగాలను జోడించి, నివారణా చర్యలను పకడ్బందీగా అమలు చేసినప్పుడే ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ పిలుపు మేరకు విజ్ఞానంతో కలిసి ఆరోగ్యవంతమైన రేపటి కోసం అందరం ఐక్యంగా కృషి చేద్దాం.

# తెలంగాణాలో దేవాలయాల పవిత్రతకు పెద్ద పీట

(సి.హెచ్.ప్రతాప్)

**తెలంగాణ రాష్ట్రంలోని దేవాలయాల పవిత్రతను కాపాడే దిశగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయం ప్రశంసనీయం. రాష్ట్రంలోని అన్ని ప్రధాన ఆలయాలను తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో ఆధ్యాత్మిక శోభతో, అత్యున్నత ప్రమాణాలతో తీర్చిదిద్దాలనే సంకల్పం భక్తులలో హర్షాన్ని కలిగిస్తోంది. ముఖ్యంగా ఆలయ ప్రాంగణాల్లో రాజకీయ జోక్యాన్ని నివారించడం, పవిత్రతను కాపాడటం ఈ ప్రతిపాదనలోని ప్రధానాంశాలు.**




సాధారణంగా ఏదైనా ప్రధాన ఉత్సవాలు జరిగినప్పుడు ఆలయాల వద్ద రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు, కటౌట్లు, పార్టీ జెండాలు దర్శనమిస్తుంటాయి. కొన్ని సందర్భాల్లో ఆలయ పరిసరాల్లో రాజకీయ సమావేశాలు నిర్వహించడం అత్యంత దురదృష్టకరం. మంత్రులు, ప్రజాప్రతినిధులు లేదా ఆలయ కమిటీ సభ్యులకు స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసే ఈ బ్యానర్లు భక్తులకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తాయి. దైవ దర్శనం కోసం వచ్చే భక్తులకు దేవుడి కంటే ముందే ఈ రాజకీయ ప్రచారాలు కనిపించడం ఆధ్యాత్మిక వాతావరణాన్ని దెబ్బతీస్తుంది. వీటికి తోడు వాణిజ్య ప్రకటనల హోరు కూడా తోడై ఆలయ ప్రశాంతతను భంగపరుస్తోంది.

రాజకీయ నాయకుల నుంచి ప్రయోజనాలు ఆశించే ఆలయ కమిటీ సభ్యులు ఇటువంటి అనవసర ధోరణులను అడ్డుకోలేకపోతున్నారు. దీనివల్ల కార్యనిర్వహణాధికారులు సైతం నిస్సహాయ స్థితిలో ఉండిపోతున్నారు. ఇప్పుడు ప్రభుత్వం తీసుకురానున్న నూతన నిబంధనల వల్ల ఆలయాల్లో రాజకీయ ప్రచారాలకు స్వస్తి పలికి, కేవలం భక్తి భావన మాత్రమే వెల్లివిరిసే అవకాశం ఉంటుంది. తిరుమలలో అమలవుతున్నట్లుగా కఠినమైన నిబంధనలు అమలు చేస్తేనే ఆలయాల విశిష్టత నిలబడుతుంది.

ఆలయ పవిత్రతను కాపాడటంలో సిబ్బంది పాత్ర కూడా కీలకమైనది. తిరుపతిలో వలె ఆలయ ఉద్యోగులందరూ సంప్రదాయ దుస్తులను ధరించడం వల్ల భక్తులలో గౌరవభావం పెరుగుతుంది. అలాగే భక్తులకు కూడా నిర్దిష్టమైన వస్త్రధారణ నిబంధనలు విధించడం అవసరం. అప్పుడే ఆలయ ప్రాంగణంలో క్రమశిక్షణ, ఆధ్యాత్మికత వెల్లివిరుస్తాయి. వాహనాల రాకపోకలను నియంత్రించడం, కేవలం విద్యుత్ వాహనాలను అనుమతించడం వంటి ప్రతిపాదనలు పర్యావరణ హితంగా ఉండటమే కాకుండా రద్దీని కూడా తగ్గిస్తాయి.

ఆధ్యాత్మిక క్షేత్రాలు రాజకీయాలకు వేదికలు కాకూడదు. బాసర జ్ఞాన సరస్వతి ఆలయంతో మొదలైన ఈ సంస్కరణలు రాష్ట్రంలోని యాదగిరిగుట్ట, వేములవాడ, భద్రాచలం వంటి పుణ్యక్షేత్రాలకు కూడా విస్తరించడం ముదావహం. భౌతిక అభివృద్ధి కంటే ఆధ్యాత్మిక విలువలకు పెద్దపీట వేయడం వల్ల తెలంగాణలోని ఆలయాలు ప్రపంచస్థాయి గుర్తింపును పొందుతాయి. ప్రభుత్వ చిత్తశుద్ధి, అధికారుల సమన్వయం తోడైతే తెలంగాణ దేవాలయాలు నిజమైన ఆధ్యాత్మిక నిలయాలుగా మారుతాయి. పవిత్రమైన ఆలయ వాతావరణంలో భక్తులకు ప్రశాంతమైన దర్శనం లభించినప్పుడే అది నిజమైన అభివృద్ధి.












## బీజేపీ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

### మన ఊరు - మన జెండా పేరుతో జెండా ఆవిష్కరించిన గంకల

### 200మంది పేద ప్రజలకు బియ్యం పంపిణి

**విశాఖపట్నం (జయ జయహే)**

విశాఖపట్నం జీవీఎంసీ 48వ వార్డులో మాజీ కార్పొరేటర్, మాజీ జీవీఎంసీ బిజెపి ఫ్లోర్ లీడర్,మాజీ స్టాండింగ్ కమిటీ మెంబర్ గంకల కవిత అప్పారావు యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం బీజేపీ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గంకల మాట్లాడుతూ దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక శత్రు దేశాలు దాడి చేసేందుకు కూడా వెనకడుగు వేశాయన్నారు.ప్రపంచంలో అతిపెద్ద శక్తివంతమైన రాజకీయ పార్టీ భారతీయ జనతా పార్టీ ఈ రోజు ఒక మహావృక్షంగా మారిందన్నారు.బీజేపీ అధికారంలోకి వచ్చాక కుల, మత ఘర్షణలు లేవని తెలిపారు. 'సబ్ కా సాత్.. సబ్ కా వికాస్' నినాదంతో బీజేపీ అడుగులు వేస్తోందన్నారు.దేశ నిర్మాణం లో సమస్యల పరిష్కారనికి భారతీయ జనతా పార్టీ అలుపెరుగని పోరాటం చేస్తుందన్నారు.బీజేపీ కార్యకర్తలు సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేసి రాబోయే ఎన్నికల్లో పార్టీ ని అధికారంలోకి రావడానికి కృషి చేయాలన్నారు.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధే లక్ష్యంగా అడుగులు వేస్తోందన్నారు.విశాఖ నార్త్ లో ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు సారధ్యంలో బిజెపి పార్టీ మరింత బలపడుతుందన్నారు. గడిచిన ఐదేళ్లలో బిజెపి పార్టీ తరపున పోటీ చేసి జీవీఎంసీ ఎన్నికల్లో కార్పొరేటర్ గా గెలిచి ప్రజల మన్ననలు పొందడం జరిగిందని,వార్డు అభివృద్ధి బిజెపి పార్టీతో సాధ్యమని నిరూపించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు, కార్యకర్తల్లో ఉత్తేజాన్ని నింపారు. ఇదే ఉత్తేజంతో రానున్న జీవీఎంసీ కార్పొరేషన్ ఎన్నికలలో బిజెపికి అధిక సీట్లు గెలుపొందేలా కార్యకర్తలు, నాయకులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం వార్డులో సుమారు 200 మంది పేద ప్రజలకు గంకల కవితా అప్పారావు యాదవ్ చేతుల మీదుగా బియ్యం పంపిణీ చేశారు. వార్డు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని, ప్రజలకు ఏ సమస్య ఏర్పడిన తక్షణమే తనను సంప్రదించాలని గంకల కవిత అప్పారావు యాదవ్ పిలుపునిచ్చారు.

# ఘనంగా బిజెపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు





## ఆదివాసి ప్రాంతంలో బిజెపి జెండా ఎగరేస్తాం

### బీజేపీ అల్లూరి జిల్లా అధ్యక్షులు శాంత కుమారి

**పాడేరు (జయ జయహే)**

ఆదివాసి ప్రాంతంలో భారతీయ జనతా పార్టీ జెండా రెపరెపలాడిస్తామని ఆ పార్టీ అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్షులు మఠం శాంత కుమారి పేర్కొన్నారు. భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పాడేరు జి.మాడుగుల మండలం లువ్వా సింగిలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాడేరు పార్టీ కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ జెండాను శాంత కుమారి ఆవిష్కరించారు. ముందుగా శాంత కుమారి స్వగృహంపై ఇంటింటా జండా కార్యక్రమంలో భాగంగా భారతీయ జనతా బిజెపి జెండాను ఎగరవేసి పార్టీ నాయకులకు, కార్యకర్తలకు శ్రేయోభిలాషులకు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో లిశాంత కుమారి మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధిలో 90 శాతం నిధులు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రతి పల్లెకు రహదారి నిర్మాణం చేపట్టాలన్న ఉద్దేశంతో గిరిజన ప్రాంతంలో గ్రామాలకు గ్రామాలు అనుసంధానం చేస్తూ వేల కోట్ల నిధులను వెచ్చించి రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో రోడ్లు నిర్మిస్తున్నది కేంద్ర ప్రభుత్వమేనన్నారు. ఎన్నడూ లేని విధంగా ఆదివాసి ప్రాంతంలో మౌలిక సదుపాయాల కల్పన ఎన్డీఏ ప్రభుత్వ పాలనలోనే అత్యధికంగా జరిగిందన్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఆదివాసి ప్రజలు అభివృద్ధికి దూరంగా ఉండకూడదని ... కనీస సదుపాయాలు వారికి దూరం అవ్వకూడదన్న ఉద్దేశంతో జల్ జీవన్ మిషన్ లో భాగంగా ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తుందన్నారు. అంత్యోదయ స్ఫూర్తితో సుపరిపాలనే లక్ష్యంగా ఎన్డీఏ కూటమి పాలన సాగిస్తుందని ఆమె చెప్పుకొచ్చారు. సేవే పరమావధిగా దేశమే ప్రప్రథమంగా జన సంఘ కాలము నుంచి నేటి వరకు పార్టీ జెండాను మోసిన మహనీయులను ఈ సందర్భంగా ఆమె స్మరించుకున్నారు. దేశ సేవకే అంకితమై నిరంతరం శ్రమిస్తున్న కోట్లాదిమంది భారతీయ జనతా పార్టీ కార్యకర్తలకు ఈ సందర్భంగా ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ రాబోయే స్థానిక ఎన్నికల్లో ఆదివాసీల మనసు గెలిచి వాడవాడలా భారతీయ జనతా పార్టీ జెండా ఎగరేసి తీరుతామని ప్రతినిబూనారు.

**పాడేరుకు మెడికల్ కళాశాల ఇచ్చింది మోడీ**

గిరిజనులకు అందని ద్రాక్షగా ఉన్న వైద్య సమస్యను పరిష్కరించాలన్న ఉద్దేశంతో ఆనాడు ఆంధ్రప్రదేశ్ పునర్ విభజన చట్టంలో భాగంగా ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలన్న విధాన నిర్ణయాల్లో భాగంగా పాడేరుకు మెడికల్ కళాశాలను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని శాంత కుమారి గుర్తు చేశారు.



## ప్రజల మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత

### అర్హులైన వారికి ఇళ్ల పట్టాలు మంజూరు

### స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్న మంత్రి

**టెక్కలి ఏప్రిల్ 6 జయ జయహే**

రాష్ట్రంలో స్థానికంగా ఉన్న సమస్యలను పరిష్కరించి అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు జరిగేలా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చం నాయుడు స్పష్టం చేశారు. టెక్కలి నియోజకవర్గం పరిధిలోని ఇల్లు లేని నిరుపేదలను గుర్తించి అర్హులైన అందరికీ ఇంటి పట్టాలను ప్రభుత్వం అందజేస్తుందని ఆయన అన్నారు, జగతిమెట్ట పరిసర ప్రాంతాల్లోనే స్థానికుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు, అర్హత లేని జాబితా ను సిద్ధం చేశామని అందులో కొంతమందిని తొలగించడం జరుగుతుందని ఆయన అన్నారు నిజమైన లబ్ధిదారులు కు ఆయన న్యాయం చేస్తామన్నారు, అవసరమైన మౌలిక సదుపాయాలు రహదారులు విద్యుత్తు మంచినీరు వంటి సదుపాయాలను కాలనీలో కల్పిస్తామన్నారు, కాలనీవాసులు తమ వద్దనున్న అధికారిక పత్రాలను స్థానిక ఆర్డిఓ కార్యాలయానికి తీసుకెళ్లి తమ అర్హత పత్రాలను చూపించాలని మంత్రి సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామన్నారు , 412 ఇళ్ల స్థలాల కు సంబంధించి ఎ లాంటి అర్హతలు లేవని రెవెన్యూ శాఖ రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చం నాయుడు దృష్టికి తీసుకువచ్చారు. సంబంధిత ఇళ్ల స్థలాలపై సమగ్రమైన దర్యాప్తు చేయాలని రెవెన్యూ శాఖ అధికారులకు మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టెక్కలి ఆర్డిఓ ఎం కృష్ణమూర్తి, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు కింజరాపు హరి వరప్రసాద్, కోట బొమ్మాలి వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు బ గాది శేషగిరిరావు, అధికారులు అన అధికారులు పాల్గొన్నారు.




## డ్రైనేజీలా, రహదారులా...???

### రోడ్ల పైనే మురుగనీరు వ్యర్థాలు

### అధికారులకు పట్టదా

**చోడవరం : ఏప్రిల్ 6 జయ జయహే**

చోడవరంలో డ్రైనేజీలు, కాల్వల్లో ప్రవహించాల్సిన మురుగు నీరు, వ్యర్థాలు రహదారుల్లోనే ప్రవహి స్తుండటంతో ఏవి రహదారులో, ఏవి డ్రైనేజీలో అర్థం కావడం లేదనీ ప్రజలు మండిపడుతున్నారు. ప్రజా ఆరోగ్యానికి భంగం కలిగిస్తూ, రోడ్లపై యదేచ్చగా మురుగునీరు వ్యర్థాలు ప్రవహిస్తుండడంతో స్థానికులు, మహిళలు, బాటశారులు, వాహనదారులు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. చోడవరం ప్రధాన రహదారిలో వివిధ వ్యాపార సముదాయాలు ద్వారా వదులుతున్న మురుగునీరు బి.ఎన్ రోడ్డు ప్రధాన రహదారిపై స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ఏరులై ప్రవహిస్తోంది. చోడవరం - చీడికాడ రోడ్డు లో రెల్లి కాలనీ లో డ్రైనేజీలు లేక ప్రధాన రహదారినే ... పంచాయతీ అధికారులు డ్రైనేజీలుగా మార్చేస్తున్నారు. చోడవరం - లక్ష్మీపురం రోడ్డులో కోనాం గెస్ట్ హౌస్ వద్ద ప్రధాన రహదారినే డ్రైనేజీగా వినియోగిస్తున్నారు. వీటిని అరికట్టాల్సిన పంచాయితీ, ప్రజారోగ్యశాఖ, రెవెన్యూ అధికారులు చూసి, చూడలేనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజారోగ్య పరిరక్షణ కమిటీ, ప్రజా సంఘాలు ఆరోపిస్తున్నాయి. వ్యర్థాలు, మురుగు నీరుతో దోమలు, వైరస్ క్రిములతో స్థానిక కనీసం బ్లీచింగ్, ఫినాయిల్ వంటివి ఆ ప్రాంతాల్లో జల్లిస్తే దుర్వాసన తగు ముఖం పడతాదని అంటున్నారు.ప్రజానీకం వీటితో సహవాసం చేస్తూ పలు అంటు వ్యాధులకు గురి కావలసి వస్తోందని మహిళలు, ప్రజా సంఘాలు ఆరోపిస్తున్నాయి.ఈ నేపథ్యంలో కాలువలు పూడిక తీయించి మురుగనీరు రోడ్లపై ప్రవహించకుండా పంచాయతీ కోరుతున్నారు దీనిపై జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సాధించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. లేకపోతే రోగాలు ప్రబల అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



## మధ్యాహ్న భోజన స్మార్ట్ కిచెన్లను రద్దు చేయాలి

### సిఐటియు జిల్లా అధ్యక్షులు వివి శ్రీనివాసరావు

**చోడవరం ఏప్రిల్ 6 జయ జయహే**

మధ్యాహ్న భోజన పథకాన్ని ఎటువంటి లాభాపేక్ష లేకుండా పేద పిల్లలకు ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలలో గత 23 ఏళ్లుగా వండి పెడుతున్న వంటలమ్మల పొట్టకొట్టి ప్రైవేటు సంస్థలకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ ఏప్రిల్ 8న జిల్లా వ్యాప్తంగా ఎంఈఓ కార్యాలయం వద్ద జరిగే ఆందోళనలో పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు వివి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సోమవారం చోడవరం మెయిన్ హైస్కూల్లో కార్మికులతో కరపత్రాన్ని ఆవిష్కరించి పలు స్కూళ్లలో పర్యటించి కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేసారు. ఈ మధ్యాహ్న భోజన పథకాన్ని కేంద్ర బిజెపి, రాష్ట్ర కూటమి ప్రభుత్వాలు "స్మార్ట్ కిచెన్" పేరుతో ఒకే చోట వండి స్కూళ్లకు పంపాలని ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నదన్నారు. ప్రభుత్వం ఇచ్చే మెనూ చార్జీలు చాలకపోయినా సమయానికి బిల్లులు రాకపోయినా అప్పులు చేసి పిల్లలకి వండి పెట్టాలని వేడివేడిగా ఆహారం అందిస్తున్నారు. సంవత్సరాలు తరబడి జీతాలు పెరగలేదు, అయినా మధ్యాహ్నం భోజన పథకాన్ని నిర్వహిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మధ్యాహ్న భోజన పథకాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగించాలని, ప్రైవేట్ పరం చేయాలని ప్రతి మండలంలో స్మార్ట్ కిచెన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించిందనీ . అక్షయపాత్ర, నవ ప్రయాస్,ఇస్కాన్ వంటి సంస్థలు పిల్లలకు పౌష్టికాహారం కలిగించే కోడుగుడ్డుని పెట్టరు! ఉల్లిపాయలు వాడరు! మధ్యాహ్న భోజన పథకం వలన చదువుకునే పిల్లల సంఖ్య పెరిగిందని, డ్రాపౌట్స్ తగ్గాయని, బాలికలలో చదువుకున్న వారి సంఖ్య పెరిగిందని ప్రభుత్వమే చెబుతోందన్నారు. అటువంటి పేదలకు విద్యార్థులకు విద్యను దూరం చేయాలనే చూస్తున్నది. స్మార్ట్ కిచెన్ పేరుతో ఏళ్ల తరబడి పనిచేస్తున్న వేలాది మంది వంట కార్మికుల ఉపాధి పోగొడుతున్నారు. వంట కార్మికుల ఉపాధి రక్షణ కోసం, స్మార్ట్ కిచెన్ కు వ్యతిరేకంగా ఏప్రెల్ -8న ఎం.ఇ.ఓ. ఆఫీసుల వద్ద ఆందోళనలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఎస్ వి నాయుడు, బుచ్చి రాజమ్మ, బాదిరెడ్డి లక్ష్మి, దేవి తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ కోసం ప్రాణం పెట్టే నాయకులు బిజెపిలో ఉన్నారు

### ప్రపంచానికి దిక్సూచి మోడీ

**చోడవరం ఏప్రిల్ 6 జయ జయహే**



బిజెపి 46వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం చోడవరం పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవలే బిజెపిలో చేరిన ప్రముఖ పారిశ్రామికవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆయన కార్యాలయంలో పెద్ద ఎత్తున కార్యకర్తలు అభిమానుల సమక్షంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, సీనియర్ బిజెపి నాయకులు విశాఖ జిల్లా ఇన్చార్జి పుట్ట గంగయ్య, ఏ ఆర్ జి శర్మ తదితరులు పాల్గొని కార్యకర్తలకు నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గంగయ్య మాట్లాడుతూ 1980లో స్థాపించబడిన బిజెపి అటల్ జి మార్గదర్శనంలో నేడు ప్రధాని మోడీజీ అడుగుజాడల్లో పయనిస్తుందన్నారు. నేడు ప్రపంచానికే దిక్సూచిగా భారతదేశం ఎదిగిందని కొనియాడారు. బిజెపి దేశం కోసం ధర్మం కోసం పనిచేస్తుందని అధికారం కోసం అర్రులు చాచలేదన్నారు. దేశం కోసం పార్టీ కోసం ప్రాణాలర్పించడానికి కూడా బిజెపి కార్యకర్తలు నాయకులు పనిచేస్తున్నారన్నారు జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు మాట్లాడుతూ.. బిజెపి క్రమశిక్షణ గల పార్టీ అని తరలించి కూడా సిద్ధాంతాల కోసం దేశం కోసం ధర్మం కోసం పోరాడుతుందని చెప్పారు. రెండు ఎంపీ సీట్లు నుంచి నేడు ప్రపంచాన్ని సాధించే స్థాయికి మోడీ నాయకత్వంలో భారతదేశం ఎదిగిందన్నారు. ప్రముఖ పరిశ్రమ కవిత బిజెపి నాయకుడు ఎమ్ వి ఆర్ మాట్లాడుతూ ప్రధాని మోడీ ఆశయాలు పనితీరు మిర్చి బీజేపీలో చేరినని ఆయన నాకు తండ్రి లాంటి వాడిని, ఆయన బిడ్డగా పార్టీ ఇచ్చిన బాధ్యతను నెరవేరుస్తానని ఈ ప్రాంతంలో ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ముఖ్యంగా చోడవరం నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారిస్తానని రానున్న ఎన్నికల్లో పార్టీ ఆదేశిస్తే ఇక్కడి నుంచి పోటీ చేస్తానని స్పష్టం చేశారు.

# సంతృప్తినిచ్చిన వేపగుంట - పినగాడి రోడ్డు విస్తరణ




## 111 మంది బాధితులకు రూ. 87 లక్షలు పంపిణీ

### ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు

**పెందుర్తి, ఏప్రిల్ 6, జయ జయహే**

విశాఖ నగరంతో పాటు చోడవరం నర్సీపట్నం మాడుగుల నియోజకవర్గాల ప్రజలకు ఎంతగానో ఉపయోగపడే వేపగుంట - పినగాడి రోడ్డు నిర్మాణం ఎమ్మెల్యేగా తనకు ఎంతో సంతృప్తినిచ్చిన కార్యక్రమం అని జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షులు , పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు అన్నారు. వేపగుంట - పినగాడి రోడ్డులో స్థలాలు కోల్పోయిన బాధితులకు నష్టపరహారం చెక్కులను, వి ఎం ఆర్ డి ఏ కమిషనర్ తేజ్ భరత్‌తో కలిసి ఎమ్మెల్యే రమేష్ బాబు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రోడ్డు నిర్మాణం కోసం ప్రజలు ఎంతో కాలంగా ఎదురు చూశారని గత వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా పనులు ముందుకు సాగలేదని విమర్శించారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన మొదటి ప్రాధాన్యతగా వేపగుంట పినగాడి రోడ్డును ఎంచుకుని అటు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణతో మాట్లాడి ఈ రోడ్డు నిర్మాణానికి కృషి చేసినట్టు చెప్పారు. ముఖ్యంగా ఈ రోడ్డు నిర్మాణంలో వి.ఎం.ఆర్.డి.ఏ కమిషనర్ తేజ్ భరత్ పాత్ర ఎంతో ప్రముఖమైనదని, ఈ రోడ్డును పూర్తి చేయడానికి ఆయన ఎంతో ఉత్సాహంగా పని చేశారని గుర్తు చేశారు. అలాంటి అధికారులు ఉంటే ఎలాంటి పని అయినా సులభంగా పూర్తి చేసుకోవచ్చునని పేర్కొన్నారు. ప్రస్తుతం 111 మంది లబ్ధిదారులకు రూ. 87 లక్షల రూపాయలు పరిహారం చెక్కులు పంపిణీ చేస్తున్నట్లు ఎమ్మెల్యే రమేష్ బాబు తెలిపారు. ఎలాంటి వివాదాలకు ఆస్కారం లేకుండా యాజమాన్యం హక్కుల మేరకు అందరికీ పరిహారం అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వి.ఎం.ఆర్.డి.ఎ. అధికారులు సూపరింటెండెంట్ ఇంజనీర్ భవాని శంకర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుధీర్ కుమార్, మండల రెవెన్యూ అధికారి వెంకట అప్పారావు, ప్లానింగ్ అధికారులు,వారి సిబ్బంది మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.



## ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

**కాకినాడ జయ జయహే**

భారతీయ జనతా పార్టీ 46 వా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కాకినాడ గోకులం సమీపంలో బీజేపీ నాయుకులు గౌతు చిన్న ఆధ్వర్యంలో మండలం అధ్యక్షులు ముమ్మిడి నాగబాబు నెత్రుత్వంలో జరిగింది ఈ కార్యక్రమనికి ముఖ్యఅతిగా బీజేపీ రాష్ట్ర మేధావులు విభాగం కన్వినర్ ముత్తా నవీన్ కృష్ణ పాల్గొని జండా ఆవిష్కరణ చేశారు తదుపరి స్వీట్స్ పంపిణీ చేసి పార్టీ కోసం పార్టీ విధివిధానాలు కోసం చెప్పాసాగారు ఈ కార్యక్రమం లో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు గుటూరు పద్మ, బీజేపీ నాయకులు కర్రీ పాపారావు, కవికొండల చలపతి, డాక్టర్ వేణుగోపాల్, రెడ్డి సత్తిబాబు, కేవీ దొర, జె ఎస్ పి కుమారి, ముమ్మిడి కళ, చంద్రశేఖర్, జానికిరామ్, గూటల భద్రరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

# వాడ వాడలా జాన్ వెస్లీ జన్మదిన వేడుకలు...!





## వెల్లువెత్తిన అభిమాన కెరటాలు

### పలు చోట్ల పండ్లు, చీరలు పంపిణీ

**విశాఖపట్నం, ఏప్రిల్ 6, జయ జయహే :**

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు బొల్లవరపు జాన్ వెస్లీ పుట్టినరోజు వేడుకలు సోమవారం నగర వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ఆయన అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి శుభాకాంక్షలు చెప్పి తమ అభిమానాన్ని చాటుకున్నారు. విశాఖ మహానగరంలోని లలితా నగర్‌లోని ఆయన క్యాంప్ ఆఫీసులో దక్షిణ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే ప్రస్తుత సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ పుష్పగుచ్ఛం ఇచ్చి జాన్ వెస్లీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ చెన్నా జానకిరామ్, 27వ వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఓల్డేజ్ హోంలో**

ఆంధ్రప్రదేశ్ వైఎసఆర్సీపీ క్రిస్టియన్ మైనార్టీ రాష్ట్ర అధ్యక్షులు. బొల్లవరపు జాన్ వెస్లీ పుట్టినరోజు వేడుకలు అమెరికన్ ఓల్డేజ్ హోమ్‌లో నిర్వహించారు. కేక్ కటింగ్ అనంతరం పేద వృద్ధ మహిళలకు అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మాజీ శాసన సభ్యులు వాసుపల్లి గణేష్ కుమార్ హాజరయ్యారు. 29వ వార్డ్ వైఎసఆర్సీపీ అద్యక్షులు పీతల వాసు, వైఎసఆర్సీపీ కనకల ఈశ్వర్, గుమ్మడి చంద్రమౌళి, ఎలమంచిలి సంతోష్ కుమార్, ఆరుగుల రాజు కుమార్, కో ఆప్షన్ మెంబర్ షరీఫ్, సౌత్ బీసీ సెల్ ప్రెసిడెంట్ బొండాడ వెంకట రమణ, తాడి రవితేజ, గనగల్ల రామరాజు, జాన్ బెన్న సామ్యూల్, పడాల సూర్య, మేడిశెట్టి రూపా, లంకె మహేశ్వరీ, కొండి సతీష్, చెన్న మురళి, పడాల చైతన్య , గొర్రెపోటీ శివ , వడ్డాది శివ, రావులపల్లి గోపి (జమదగ్ని), గొలగని మధు, పీతల ఉమా మహేష్, పీతల చరణ్, గండి వలస పెంటయ్య, పాల్గొన్నారు



**37వ వార్డులో చీరలు పండ్లు పంపిణీ..!**

37 వార్డు రెల్లి వీధి అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగిన జాన్ వెస్లీ పుట్టిన రోజు వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ 100 మంది పేద మహిళలు కు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 37 వార్డు మాజీ కార్పొరేటర్ చెన్న జానకి రామ్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ రెయ్యి డేవిడ్ రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి గనగల్ల రామరాజు లక్ష్మీపతి, సారిక దయాకర్ , నోళ్ళు చంటి, రోజా, రమణి పాల్గొన్నారు.

**30 వ వార్డ్ లో జాన్ వెస్లీకి సత్కారం..!**

విశాఖ దక్షిణ నియోజకవర్గ 30వ వార్డులో క్రిస్టియన్ మైనారిటీ రాష్ట్ర మాజీ చైర్మన్ బొల్లవరపు జాన్ వెస్లీ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో జాన్ వెస్లీ కేక్ కట్ చేసిన అనంతరం వార్డ్ నాయకులు ఆయనకు అంబేద్కర్ ప్రతిమను ఇస్తూ ఘనంగా సత్కరించారు. 30వ వార్డు వార్డు ప్రెసిడెంట్ దశమంతుల మాణిక్యాలరావు, వార్డ్ ఇంచార్జ్ దస్మంతుల చిన్ని, కోనశంకర్, తాడి రవితేజ, వడ్డాది దిలీప్, లీలా, సురకల రాము, సంతోషి, ఆకుల శ్యామ్, త్రినాథ్, రమేష్, గోవింద్, కళ్యాణి ,మనీ, మీనా, యూత్ ప్రెసిడెంట్ బాబ్జి, రాజేష్, గణేష్, సాయి ప్రేమ్ కుమార్ వైఎసఆర్సిపి అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు



**35వ వార్డ్ లో చీరలు పంపిణి**

డా. బొల్లవరపు జాన్ వెస్లీ పుట్టినరోజు వేడుకలు 38వ వార్డు వద్ద జిల్లా బీసీ విభాగం అధ్యక్షులు సనపల రవీంద్ర భారత్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి . ఈ సందర్భంగా మహిళలకు చీరలు పంపిణీ చేశారు. 35వ వార్డులో వార్డు అధ్యక్షులు అలుపన కనకారెడ్డి ఆధ్వర్యంలో జాన్ వెస్లీ కి సాలువతో సన్మానించి పూలమాలతో సత్కరించారు. జాన్ వెస్లీ తో భారీ కేక్ కటింగ్ చేయించి అనంతరం వృద్ధులకు చీరలు ఫ్రూట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జీరు సూర్యనారాయణ రెడ్డి, కే గంగాధర్, గొరుసు నాగిరెడ్డి, ఈశ్వరరావు, పోలవరపు రమణమ్మ, పిల్లి నగేష్, దొడ్డి కృష్ణవేణి, పట్నానమీనా. తదితరులు పాల్గొన్నారు.

**సర్వేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో...!**

27వ వార్డు అధ్యక్షులు నీలాపు సర్వేశ్వర రెడ్డి, 35వ వార్డు అధ్యక్షులు అలుపన కనకారెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర వై ఎస్ ఆర్ సి పి క్రిస్టియన్ మైనారిటీ అధ్యక్షులు బొల్లవరపు జాన్ వెస్లీ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. వెస్లీతో వారు

భారీ కేక్ కటింగ్ చేయించి అనంతరం వృద్ధులకు చీరలు ఫ్రూట్స్ పంపిణీ చేశారు. ఈతలపాక విజయ్ భాస్కర్, దాసరి విజయ్ భాస్కర్ రెడ్డి, జి.వి. రమణ, ఈతలపాక శివ, నాగిరెడ్ల శ్రావణి, భీముని. పద్మిని (పావని ), శీరపు మేఘన, పొన్నాడ త్రినాథ్, వార్డ్ కార్యవర్గ సభ్యులు ఎం. తాతబాబు తదితరులు పాల్గొన్నారు



## గ్రామ అభివృద్ధికి యువత ముందడుగు

### అభివృద్ధి కార్యక్రమాలకు విరాళాలు సేకరణ

**కాకినాడ జిల్లా,(జయ జయహే)**

కిర్లంపూడి మండలం శృంగారాయుని పాలెం గ్రామంలోని పంచాయతీ రోడ్లు ప్రస్తుతం అపరిశుభ్రతగా ఉన్న నేపథ్యంలో, వాటిని శుభ్రపరచి పరిశుభ్రతను కాపాడేందుకు యువజన సేవ సంఘం సభ్యులు యువత శ్రమదానం చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం తరపున విరాళాలు అందజేశారు.,గ్రామమంలోని శ్మశాన వాటికను శుభ్రంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు మరియు అంబేద్కర్ విగ్రహం వెనుక ఉన్న ఖాళీ స్థలాన్ని అంబేత్కర్ చిల్డ్రన్స్ పార్క్ గా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నారు ఈ కార్యక్రమాలు అడ్డాల సతీష్ కుమార్ ఆధ్వర్యంలో యువజన సేవ సంఘం చేపట్టనున్న కార్యక్రమాలకు, యువత సేవాభావం అభినందనీయమని పంచాయతీ కార్యదర్శి కె .జ్యోతి పేర్కొన్నారు అవసరమైన సహకారం పంచాయతీ తరపున అందిస్తామని జ్యోతి తెలిపారు.



## అగ్ని ప్రమాదంలో ఇల్లు కోల్పోయిన కుటుంబానికి ఆర్థిక సహాయం చేసిన అల్లూరి వర్తక సంఘం

**కొయ్యూరు : (జయ జయహే)**

అల్లూరి జిల్లా కొయ్యూరు మండల పరిధి లో సింగవరంలో ఇల్లు కోల్పోయి ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాన్ని తమ వంతు సాయంగా అల్లూరి వర్తక సంఘం పది వేలు ఆర్థిక సహాయం, మరియు వస్త్రాలు, ఫ్యాను అందజేశారు. సోమవారం అల్లూరి వర్తక సంఘ అధ్యక్షుడు మేడిపోయిన చక్కరరావు, ఉపాధ్యక్షుడు షేక్ పీరు , వర్తక సంఘ నేతలు మొల్లేటి వీరాంజనేయ, కందుకూరు వెంకటేశ్వరరావు, కాకర చిన్నారావు తోపాటు పలువురు పాల్గొన్నారు.. సింగవరానికి చెందిన పాము రాజు కుటుంబానికి కలిసి ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. ఎన్నో కష్టాలతో కిడ్నీ వ్యాధి బాధపడుతూ ఉన్న కుటుంబానికి మరి కొంతమంది దాతలు ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని వారు కోరారు.

# గోవులతో ఆరోగ్యం ఆనందం

## గోవర్ధనపురం గోశాల నిర్వాహకులు దొడ్డా మహేష్



**విశాఖపట్నం జయ జయహే**

నిరంతరం గోవుల సేవలో నిమగ్నమవుతూ గోమాత ను ఆరాధిస్తూ తన జీవితాన్ని సార్ధకం చేసుకుంటున్నారు శ్రీకాకుళం జిల్లా సారవకోట మండలం, పెదగుజ్జువాడ గ్రామానికి చెందిన దొడ్డా మహేష్.అవనీర్ గ్రానైట్స్ పేరిట వ్యాపారం చేస్తున్నప్పటికీ.. గోవులను సంరక్షించడం, పంచగవ్యాలు ప్రయోజనాలు తెలియజేయడం, గో ఆధారిత వ్యవసాయానికి ఊతమివ్వడం తనకు ఎంతో ఆనందమిస్తుందని చెబుతున్నారు మహేష్. పెదగుజ్జువాడ గ్రామం లో గోవర్ధనపురం గోశాల ను నిర్వహిస్తున్న మహేష్.. దేశంలో వివిధ రాష్ట్రాలకు చెందిన ఆవులను సంరక్షించి వాటి ద్వారా ప్రయోజనాలను పది మందికి అందిస్తున్నారు. గుజరాత్ కు చెందిన కాంక్రేజ్, పంజాబ్ కు చెందిన సాహివాల్, రాజస్థాన్ కు చెందిన రాఠి, పుంగనూరు కు చెందిన చిన్న పరిణామం ఆవులు, తార్ ఎడారి ప్రాంతానికి చెందిన తార్ పార్కర్ ఆవులను సంరక్షిస్తున్నారు.తను ఏర్పాటు చేసిన గోశాల ద్వారా స్వచ్ఛమైన, నాణ్యమైన పంచగవ్యాలను అందజేస్తున్నారు. సింహాచలం గోశాల లో ఏప్రిల్ 1 నుండి ఐదు రోజుల పాటు జరిగిన శబల భోజనాలు పండుగ సందర్భంగా తమ గోశాల కు చెందిన గోవులను ప్రదర్శించడం తో పాటు గో ఆధారిత ఉత్పత్తుల కూడిన స్టాల్స్ ను ఏర్పాటు చేశారు.అలాగే శబల భోజనాలు తయారీ కి వీలుగా కొంత పాలు, నెయ్యి విరాళంగా అందజేశారు. అలాగే పెద్దగుజ్జువాడ, చినగుజ్జువాడ కు చెందిన 40 మంది రైతులకు గో ఆధారిత వ్యవసాయం చేసేందుకు వీలుగా అవగాహన కల్పించేందుకు దొడ్డా మహేష్ నడుంబిగించారు. పశుపోషణ విషయం లో మెలుకువలు తెలిపేందుకు ముందుకొచ్చారు. 40 మంది రైతులకు ఇన్పుట్స్ ఇచ్చి,వారు వ్యవసాయం చేసుకునేందుకు విలువ తోడ్పాటునందించి ఊరికి భరోసాగా నిలవనున్నారు. 40 మంది రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసే బాధ్యతను కూడా దొడ్డ మహేష్ సభల భోజనాల పండుగ సాక్షిగా తీసుకున్నారు.ప్రకృతి సేద్యం.. పశుపోషణ కు దొడ్డా మహేష్ చేస్తున్న కృషిని ప్రకృతి ప్రేమికులు, గో ఆధారిత వ్యవసాయాన్ని కాంక్షిస్తున్న వారు ప్రశంసిస్తున్నారు. రైతులు గోవులకు దూరం కావడం సరికాదని, పాడిపంటల పట్ల



ఆసక్తి చూపుతూ గో ఆధారిత వ్యవసాయం చేయడానికి ముందుకు రావాలని దొడ్డ మహేష్ కోరుకుంటున్నారు. అవుతో అనంతం, అభివృద్ధి,ఆరోగ్యం, ఆనందం, ఆధ్యాత్మికం, ఆర్థికం సమకూరుతుందని మహేష్ తెలిపారు.






## నందనవం సౌభాగ్య నూతన వెంచర్ భూమి పూజ

### బ్రోచర్ ఆవిష్కరించిన ఎం డి కె కె రాజు

**విశాఖపట్నం (జయ జయహే)**

సిరి వెంకటేశ్వర డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ 24వ వెంచర్ ఆనందపురం మండలం జగన్నాధపురం లో. నందనవనం సౌభాగ్య' పేరుతో ప్రారంభించారు. ఈ సందర్భంగా కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ కె కె రాజు భూమి పూజ చేసి లేఔట్ బ్రోచర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కె కె రాజు మాట్లాడుతూ విశాఖ రియల్ ఎస్టేట్ రంగంలో త్వరితగతిన అభివృద్ధి అవుతున్న ఆనందపురం దగ్గరలో ఈ వెంచర్ లో పెట్టుబడి పెట్టినవారు భవిష్యత్తులో మంచి లాభాలు పొందే అవకాశం ఉందని అన్నారు. తర్లువాడలో రానున్న గూగుల్ సిటీ కి సుమారు 1 కిలోమీటర్, ఐటీబీపీ అకాడమీ 1కిలోమీటర్, అలాగే ప్రభుత్వ ప్రతిపాదించిన ఆనందపురం ఐటీ సెజ్ కు 100 మీటర్లు దగ్గరలో ఈ వెంచర్ ఉందని, కావున త్వరలో ఈ ప్రాంతంలో ఇళ్ళ స్థలాలకు మంచి గిరాకి ఏర్పడే అవకాశం ఉందని అన్నారు. ప్రస్తుతం 40 అడుగుల రోడ్ ఉన్న ఈ మాస్టర్ ప్లాన్ రోడ్ 60 అడుగులుగా అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ మార్కెటింగ్ సిబ్బంది కస్టమర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# తిరుమల మెడికవర్‌లో ఆరోగ్యంపై అవగాహన సదస్సు




**విజయనగరం, ఏప్రిల్ 7: (జయ జయహే)**

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా విజయనగరం తిరుమల మెడికవర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించే కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలియజేశాయి ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యులు మాట్లాడుతూ, ప్రస్తుత జీవనశైలిలో మార్పుల కారణంగా అనేక రకాల వ్యాధులు పెరుగుతున్నాయని, వాటిని నివారించడానికి సమతుల్య ఆహారం, నియమిత వ్యాయామం, మరియు పర్యాయ కాలిక ఆరోగ్య పరీక్షలు అత్యంత అవసరమని సూచించారు.ఆసుపత్రి వైద్యులు ప్రజలకు ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా, చిన్న లక్షణాలు కనిపించినప్పుడే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ముఖ్యంగా హృదయ సంబంధిత వ్యాధులు, మధుమేహం, రక్తపోటు వంటి దీర్ఘకాలిక వ్యాధులను ముందుగానే గుర్తించడం ద్వారా సమర్థవంతంగా నియంత్రించవచ్చని పేర్కొన్నారు.ఆరోగ్యం అనేది ప్రతి వ్యక్తి యొక్క ప్రాథమిక హక్కు. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోవడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చు. ప్రతి ఒక్కరూ సంవత్సరానికి కనీసం ఒకసారి పూర్తి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి." హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె . తిరుమల ప్రసాద్ మాట్లడుతూ విజయనగరం తిరుమల మెడికవర్ హాస్పిటల్స్ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందిస్తూ, ఆరోగ్యంపై అవగాహన కల్పించడంలో ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు.

# నవంబర్ నాటికి మూలపేట పోర్టు పూర్తి

## రూ.4,360 కోట్లతో పోర్టు నిర్మాణం చేపట్టాం

## గత ప్రభుత్వంలో 20శాతం పనులు మాత్రమే చేశారు

## ప్రస్తుతం 70.54 శాతం పనులు పూర్తయ్యాయి

## పోర్టు పనులను పరిశీలించిన మంత్రులు జనార్ధన్, అచ్చన్న



**శ్రీకాకుళం, ఏప్రిల్ 6 , జయ జయహే**

శ్రీకాకుళం జిల్లా వాసుల చిరకాల ఆకాంక్ష మూలపేట పోర్టు అని మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, అచ్చెన్నాయుడు అన్నారు. రూ.4,360 కోట్లతో పోర్టు నిర్మాణం చేపట్టామని.. 1,524 ఎకరాల్లో 4 బెర్త్‌ల నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. మూలపేట పోర్టును ఈ నవంబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. మూలపేట పోర్టును మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, అచ్చెన్నాయుడు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి జనార్దన్ మాట్లాడుతూ.. మూలపేట పోర్టును పరిశీలించామని.. ప్రాజెక్ట్ నిర్మాణంపై సమీక్ష నిర్వహించామని తెలిపారు. గత ప్రభుత్వంలో 20 శాతం పనులు మాత్రమే చేశారని.. ప్రస్తుతం 70.54 శాతం పనులు పూర్తయినట్లు మంత్రి తెలిపారు. 20 నెలల్లోనే 49.63 శాతం ప్రాజెక్ట్ పనులు పూర్తి అయినట్లు వెల్లడించారు. కరపత్రిక అడ్డం పెట్టుకుని విష ప్రచారం చేస్తున్నారంటూ వైసీపీపై విరుచుకుపడ్డారు. పోర్టు కోసం కావల్సిన ఉప్పు భూముల విషయంలో వైసీపీ చిత్తశుద్ధితో పని చేయలేదని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చాక ఉప్పు భూముల కోసం కేంద్రంతో సంప్రదింపులు చేశామని.. 385 ఎకరాల ఉప్పు భూములను లీజ్‌పై కేంద్ర కేటాయించిందని వివరించారు. వైసీపీ నేతలు 20 నెలల తరువాత రాజకీయం చేస్తున్నారని.. ఈ 20 నెలలు నిద్ర పోయారా అంటూ మంత్రి ప్రశ్నించారు. రాజకీయ ఉనికి కోసమే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఉత్తరాంధ్ర ప్రజలు అందుకే బుద్ధి చెప్పారన్నారు. రాజధాని అని చెప్పినా ఉత్తరాంధ్ర ప్రజలు నమ్మలేదని తెలిపారు. ప్రజా సమస్యలపై మాట్లాడుదాం రండి అంటూ జగన్, వైసీపీ నేతలకు మంత్రి ఛాలెంజ్ విసిరారు. గతంలో అమరావతికి ఓకే అన్న జగన్.. మోసం చేసి తరువాత మూడు ముక్కలు ఆట ఆడారని మండిపడ్డారు. జగన్ అభివృద్ధి చేసే నాయకుడు కాదని.. విధ్వంసం సృష్టించే నాయకుడంటూ వ్యాఖ్యలు చేశారు. అందుకే 11సీట్లకి పరిమిత మయ్యారన్నారు. దేశంలో ప్రైవేట్ ఎయిర్‌పోర్ట్‌లలో బోగాపురం నంబర్ 2గా నిలవనుందని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. మూలపేట పోర్టు పనులు 20 శాతం నుంచి 76 శాతం పూర్తి చేశామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. పోర్టులో షిప్ వచ్చి ల్యాండ్ అయ్యిందని.. బెర్త్‌లు లేకుండా షిప్ రాదు కదా అని అన్నారు. పోర్టు కట్టిన తరువాత రోడ్డు, రైల్ రవాణా అవసరం ఉంటుందన్నారు. పోర్టు కోసం సాల్ట్ ల్యాండ్‌లు అవసరమని చెప్పుకొచ్చారు. 385 ఎకరాల సాల్ట్ భూములను కేంద్రం లీజ్‌కు ఇచ్చిందని.. దానిపై కూడా ఒకరు కోర్టుకు వెళ్లారన్నారు. పోర్టును నవంబర్ నాటికి పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఫారెస్ట్ ల్యాండ్, జెన్ కో పవర్ సమస్యలను వీలైనంత త్వరగా అధిగమిస్తామని చెప్పారు. అడ్డగోలుగా పూర్తి చేసినట్లు వైసీపీ నేతలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మూలపేట వాసులు త్యాగధనులని కొనియాడారు. పోర్టు వల్ల ఎంఎ÷-లాయిమెంట్ రాదని.. పోర్టు పరిసరాల్లో పరిశ్రమలు రావాల్సి ఉందని చెప్పారు. 17 కంపెనీలు ల్యాండ్ కోసం దరఖాస్తు చేశాయని తెలిపారు. మూలపేట పోర్టును సందర్శించడానికి వైసీపీని ఆహ్వానిస్తున్నామని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు.



# త్వరలోనే మెడికల్ కాలేజీ పూర్తి

## అందుబాటులోకి ఆసుపత్రి సేవలు.. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్

**పల్నాడు, జయ జయహే**

పిడుగురాళ్ల మెడికల్ కాలేజీతోపాటు ఆసుపత్రి సేవలు ఈ ఏడాది ప్రారంభిస్తామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ వెల్లడించారు. ఈ మెడికల్ కాలేజీ, బోధన ఆసుపత్రి నిర్మాణం నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయాలని ఉన్నతాధికారులను ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి ఆదేశించారు. సోమవారం పల్నాడు జిల్లాలోని పిడుగురాళ్లలో మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా మెడికల్ కాలేజీతోపాటు ఆసుపత్రి నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రం విడిపోయి పదమూడేళ్లు అయినా.. రాజధాని లేదని దేశమంతా నవ్వుతున్నారని అన్నారు. గత పాలకుల వల్లే మన రాష్ట్రానికి ఈ పరిస్థితి వచ్చిందని విమర్శించారు. గత ఐదేళ్ల కాలంలో మూడు ప్రాంతాల పేర్లు చెప్పారని.. ప్రస్తుతం మూడు ఊర్ల పేర్లు చెబుతున్నారంటూ వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌తోపాటు ఆ పార్టీ నేతలపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు.

# అవినీతిని అంతమొందించడానికే బీజేపీ

## బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో సోము వీర్రాజు

**విశాఖపట్నం, ఏప్రిల్ 6, జయ జయహే**



రాజకీయాల్లో పేరుకుపోయిన అవినీతిని అంతమొందించడానికే బీజేపీ ఆవిర్భవించిందని మాజీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. సోమవారం భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో పార్టీ 46 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరిగాయి. బీజేపీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు పరశురామ రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా సోము వీర్రాజు హాజరై పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ రాజకీయాలలో అవినీతిని తొలగించడానికే బిజెపి ఆవిర్భవించిందని అన్నారు. అంత్యోదయ స్ఫూర్తితో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న ప్రజల యొక్క జీవన ప్రమాణాలను మెరుగుపరిచే దిశగా బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. జిల్లా అధ్యక్షులు పరశురామ రాజు మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావానికి దారితీసిన పరిస్థితులు దేశంలోని అన్ని వర్గాల అభ్యున్నతి కొరకు పార్టీ చేపట్టిన వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కేతినేని సురేంద్ర మోహన్, బీజేపీ రాష్ట్ర కోశాధికారి వీ నాగేంద్ర, బీజేపీ రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ కేశవకాంత్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరంగం ధనేశ్వర రావు, విశాఖ జిల్లా మహిళా మోర్చా ప్రెసిడెంట్ నాదేళ్ల జ్యోతి, దాడి పురుషోత్తం రమేష్, బీజేపీ రాష్ట్ర బిల్డింగ్ సెల్ మెంబర్ బొచ్చా సురేష్ కుమార్, బీజేపీ రాష్ట్ర మీడియా ప్యానెలిస్ట్ కరణంరెడ్డి నరసింగ రావు, బీజేపీ జిల్లా పదాధికారులు మరియు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేదల ఆకలి తీర్చడంలో జనచైతన్య సమితి సేవలు అభినందనీయం

**పెదకూరపాడు,ఏప్రిల్ 6( జయ జయహే )**





నిరుపేదల ఆకలి తీర్చడంలో జనచైతన్య సమితి చేస్తున్న సేవలు అభినందనీయమని జమ్మూ కాశ్మీర్ కిస్తివాడ సిఆర్పిఎఫ్ సబ్ ఇన్స్పెక్టర్ మందడపు ఏసోబు అన్నారు. పెదకూరపాడులో జరిగిన రెండు ఫంక్షన్లలో మిగిలిన ఆహారాన్ని సోమవారం జన చైతన్య సమితి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులకు తెలపడంతో వారు ఆ ఆహారాన్ని సేకరించి మండలంలోని తాళ్లురు బుడిగి జంగాల కాలని, పెదకూరపాడులోని వలస కూలీలకు భోజనాన్ని పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎస్సై ఏసోబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సేవాభావాన్ని కలిగి ఉండాలన్నారు. జన చైతన్య సమితి స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి తుళ్లూరి సాంబశివరావు మాట్లాడుతూ ఫంక్షన్ ఏదైనా భోజనాలు మిగిలి ఉంటే సమాచారం ఇవ్వండని ఆభోజనాలను సేకరించి ఎక్కడైతే పేదవారు ఉంటారు వారికి ఆహారాన్ని పంపిణీ చేస్తామన్నారు. ఆకలితో ఉన్నవారి కడుపులోకి వెళ్ళే ఒక్కొక్క మెతుకు వారికి ప్రాణాన్ని పోసి వారిలో ప్రాణశక్తిని నింపేదనన్నారు. ఈకార్యక్రమంలో జన చైతన్య సమితి ప్రతినిధులు దాసరి విజయ్ బెన్నిబాబు,నాదెండ్ల అప్పారావు,గుడిపూడి బ్రహ్మానాయుడు తదితరులు ఉన్నారు.



# జాన్ వెస్లీ సేవలు నిరుపమానం

## జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి

**విశాఖపట్నం (జయ జయహే)**

వైయస్సార్సీపి రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ చైర్మన్ జాన్ వెస్లీ సేవలు నిరుపమానమని మాజీ ఎమ్మెల్యే దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ కొనియాడారు. జాన్ వెస్లీ జన్మదిన వేడుకలు పురస్కరించుకొని పుష్పగుచ్ఛం అందజేసి వాసుపల్లి శుభాకాంక్షలు తెలిపారు. వైయస్సార్సీపి లో విశిష్ట సేవలు అందిస్తూ జగన్మోహన్ రెడ్డికి ఆత్మీయుడిగా మంచి పేరు ప్రఖ్యాతలు పొందారన్నారు. క్రిస్టియన్ సోదరులకు వైసిపి ప్రభుత్వం ద్వారా సముచిత స్థానం కల్పించేందుకు, అలాగే వారికి రావలసిన పథకాలపై ఎంతగానో కృషి చేశారన్నారు. దక్షిణ నియోజకవర్గంలో తనతోపాటు కార్యక్రమంలో పాలుపంచుకుంటున్న జాన్ వెస్లీ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని వాసుపల్లి ఆకాంక్షించారు. దక్షిణ వైఎస్ఆర్సిపి శ్రేణులతో కలిసి ఆయనకు శాలువా కప్పి సత్కరించారు. ఆయన మరిన్ని జన్మదిన వేడుకలు జరుపుకొని నిండు నూరేళ్లు సంతోషంగా జీవించాలని వాసుపల్లి గణేష్ కుమార్ దీవెనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మాజీ కార్పొరేటర్ చెన్నా జానకిరామ్, వార్డు అధ్యక్షులు పీతల వాసు, నీలాపు సర్వేశ్వర్ రెడ్డి,స్టేట్ మజీ డైరెక్టర్ స్టేట్ యూత్ సెక్రటరీ కనకల ఈశ్వరరావు, జిల్లా వైస్ వైస్ ప్రెసిడెంట్ డేవిడ్ రాజు, స్టేట్ ఆర్టిఏ సెక్రెటరీ ఈతలపాక విజయ్, జిల్లా ఆర్టిఐ జనరల్ సెక్రటరీ అరుగుల రాజు, జిల్లా నాయకులు ఎలమంచి సంతోష్, జిల్లా యూత్ జనరల్ సెక్రెటరీ చంద్రమౌళి, వార్డ్ నాయకులు విజయ్



# శ్రీ నూకంబిక అమ్మవారిని దర్శించుకున్న శ్రీ నిత్య విద్యానంద భారతి స్వామి

**అనకాపల్లి జయ జయహే**

ఉత్తరాంధ్ర ఇలవేల్పు ఆరాధ్య దైవమైన శ్రీశ్రీశ్రీ నూకాంబిక అమ్మవారిని సోమవారం శ్రీ నిత్య విద్యానంద భారతి స్వామి దర్శించుకోవడం జరిగింది. వీరికి ఆలయ పాలకవర్గ సభ్యులు వేద పండితులు మంత్ర చరణాల మధ్య మేళతాళాలతో స్వాగతం పలకడం జరిగింది. వీరు అమ్మవారిని దర్శించుకుని ఆలయ ముఖ మండపంలో ఆసీనులు కావడం జరిగింది వీరికి వేద పండితులు ఆశీర్వచనాలతో ఆశీర్వదించి ఆలయ ఈవో శ్రీనివాస్ దుస్సాలవతో సత్కరించి అమ్మవారి చిత్రపటాని బహుకరించడం జరిగింది ఈ కార్యక్రమంలో ఆలయ పాలకవర్గ సభ్యులు అభిమానులు తదితరులు పాల్గొన్నారు



## అక్షర సేద్యం నుండి

# డిజిటల్ విప్లవం వైపు

**అనకాపల్లి జయ జయహే**

అక్షర సేద్యం నుండి డిజిటల్ విప్లవం వైపు మారుతున్న కాలానుగా సాంకేతిక పరిజ్ఞాన పై పట్టు సాధించడం ప్రతి ఒక్కరికి అనివార్యమని శ్రీ గౌరీ గ్రంథాలయం అధ్యక్షుడు బుద్ధారమనాజీ స్పష్టం చేశారు. స్థానిక గౌరీ గ్రంథాలలో సోమవారం నుంచి కంప్యూటర్ శిక్షణా తరగతుల ప్రారంభోత్సవ సభలో ఆయన మాట్లాడుతూ నేటి డిజిటల్ యోగంలో కంప్యూటర్ పరిజ్ఞానం లేకపోవడం అచ్చరాశ్యత లేకపోవడం తో సమానమని ఆయన అభిప్రాయపడ్డారు. టెన్త్ క్లాస్, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు మాత్రమే కంప్యూటర్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. గౌరీ గ్రంథాలయం కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ మాట్లాడుతూ సమాజంలో సాంకేతిక అంతరానీ తగ్గించాలని ఉద్దేశంతో ఈ శక్తి నా కేంద్రాన్ని ఏర్పాటు చేశామని సర్టిఫికెట్ ఇన్ కంప్యూటర్ కాన్సెప్ట్స్, ఎంఎస్ ఆఫీస్, ఎంఎస్ వర్డ్, ఎం ఎస్ ఎక్స్ ఎల్, ఎమ్ ఎస్ పవర్ పాయింట్, ఇంటర్నెట్ కాన్సెప్ట్ మొదలగు కోర్సులకు శిక్షణ ఇస్తామని ఆయన పేర్కొన్నారు ప్రతిరోజు తీరి ప్రాక్టికల్స్ కూడా జరుగుతాయని నైపుణ్యం కలిగిన నిపుణులు ద్వారా కంప్యూటర్ శిక్షణా తరగతులు నిర్వహిస్తామని ఈ శిక్షణ ద్వారా ఎంతో మంది నిరుద్యోగులకు స్వయం ఉపాధి అవకాశాలు లభిస్తాయి అని కాండ్రేగుల వెంకటరమణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాకల్టీ సరగడం కిషోర్, గ్రంథాలయ సభ్యులు ప్రోగ్రాం కన్వీనర్ మల్ల బాపు నాయుడు, కాండ్రేగుల సత్యనారాయణ ఎస్ఎఫ్ఐ తదితరులు పాల్గొన్నారు



# 15 ఏళ్ల వయసులో అశ్లీల సైట్‌లో నా ఫొటో: జాన్వీకపూర్

డీప్ ఫేక్ కారణంగా 15 ఏళ్ల వయసులో తనకొక చేదు సంఘటన ఎదురైందని నటి జాన్వీకపూర్ తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో తెలిపారు. అశ్లీల వెబ్‌సైట్‌లో తన మార్ఫింగ్ ఫొటో చూసి షాకైనట్లు చెప్పారు. "దీనిని డీప్ ఫేక్ అంటారో లేదో నాకు తెలియదు కానీ, 15 ఏళ్ల వయసులో నాకు అలాంటి ఘటనే ఎదురైంది. అశ్లీల వెబ్‌సైట్‌లో ఎవరో నా ఫొటోను అప్‌లోడ్ చేశారు. అప్పుడు నేను స్కూల్‌లో చదువుకుంటున్నా. ఓసారి అశ్లీల వెబ్‌సైట్‌లో నా ఫొటో చూసినట్లు తెలిసిన వారు చెప్పారు. ఆక్షణం నాకేం అర్థం కాలేదు. నేనెంతో బాధపడ్డా. సోషల్‌మీడియాలో నైతికత లేదని అర్థమైంది. ఇలాంటి మూల్యం చెల్లించుకోక తప్పదని భావించా" అని జాన్వీకపూర్ అన్నారు. "డీప్ ఫేక్ కారణంగా ఇప్పటికీ సమస్యలు ఎదుర్కొంటున్నా. దీనివల్ల నాకు ప్రశాంతత లేకుండా పోయింది. కొన్నిసార్లు అధికారిక న్యూస్ పేజీలు కూడా నా ఏఐ ఇమేజ్‌లను ఒరిజినల్ అనుకుని వాడేస్తుంటాయి. ఆ ఫొటోలు చూసి షాకవుతుంటా. ఆయా ఫొటోలు నేనే అధికారికంగా షేర్ చేసినట్లు ప్రచారం జరుగుతుంటుంది. దీనివల్ల వర్క్ లైఫ్‌లో సమస్యలు కూడా వస్తుంటాయి. ఈ డీప్‌ఫేక్ వల్ల పడుతున్న బాధను బయటకు వచ్చి చెప్పాలని ఉంటుంది. కాకపోతే నాకంత వాయిస్ లేదని అనిపిస్తుంటుంది" అని ఆమె వివరించారు. సినిమాల విషయానికి వస్తే ప్రస్తుతం ఆమె 'పెద్ది' కోసం వర్క్ చేస్తున్నారు.




# థియేటర్‌లో తెరకు నమస్కారం చేసిన శర్వానంద్..

## 'బైకర్' సక్సెస్‌తో ఫుల్ ఎమోషన్

టాలీవుడ్ హీరో శర్వానంద్ ప్రస్తుతం వరుస విజయాలతో మంచి ఫామ్‌లో దూసుకుపోతున్నారు. ఈ ఏడాది సంక్రాంతి సందర్భంగా విడుదలైన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌తో సూపర్ హిట్ అందుకున్న ఆయన, తాజాగా బైకర్ సినిమాతో మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు. మోటార్ బైక్ రేసింగ్ నేపథ్యంలో భావోద్వేగాలను మేళవిస్తూ తెరకెక్కిన ఈ సినిమా ప్రేక్షకుల నుంచి మంచి స్పందనను అందుకుంటోంది. ముఖ్యంగా సినిమాలో డా. రాజశేఖర్ పోషించిన తండ్రి పాత్ర, శర్వానంద్‌తో ఉన్న ఎమోషనల్ సన్నివేశాలు ప్రేక్షకులను కదిలిస్తున్నాయి. ఈ సీన్స్ సినిమా హైలైట్‌గా నిలిచాయి. ఇక ఈ సినిమాపై సినీ ప్రముఖులు కూడా ప్రశంసలు కురిపిస్తున్నారు. ముఖ్యంగా నాగార్జున 'బైకర్' చిత్రాన్ని కొనియాడుతూ, కుటుంబ భావోద్వేగాలను ఎంతో అందంగా చూపించారని, రేసింగ్ సన్నివేశాలు, క్లైమాక్స్ అద్భుతంగా ఉన్నాయని అభినందించారు . ఏప్రిల్ 3న విడుదలైన ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటూ థియేటర్లలో హౌస్‌ఫుల్ కలెక్షన్లతో దూసుకుపోతోంది. ఈ నేపథ్యంలో శర్వానంద్ స్వయంగా థియేటర్లను సందర్శిస్తూ ప్రేక్షకులతో కలిసి సినిమా ఆనందిస్తున్నారు.

# జైలర్ 2 షూటింగ్... రజినీకాంత్ క్లారిటీ

సూపర్ స్టార్ రజినీకాంత్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టాడని తెలిసిందే. వీటిలో ఒకటి జైలర్ సీక్వెల్ జైలర్ 2. తలైవా టైటిల్ రోల్‌లో నటిస్తోన్న ఈ చిత్రాన్ని కోలీవుడ్ డైరెక్టర్ నెల్సన్ దిలీప్‌కుమార్ డైరెక్ట్ చేస్తున్నాడు. ప్రస్తుతం మూవీ షూటింగ్‌లో బిజీగా ఉన్నాడు తలైవా. మీడియాతో చేసిన చిట్‌చాట్‌లో ఆసక్తికర విషయాన్ని షేర్ చేశాడు రజినీకాంత్. జైలర్ 2 షూటింగ్ తుది దశలో ఉందని.. త్వరలో చిత్రీకరణ పూర్తవుతుందని తెలిపాడు. అంతేకాదు విడుదల తేదీని మేకర్స్ త్వరలోనే ప్రకటిస్తుందని కూడా చెప్పాడు. జైలర్ 2ను 2026 జూన్ 12న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నామని ఇప్పటికే రజినీకాంత్ క్లారిటీ కూడా ఇచ్చాడని తెలిసిందే. తాజాగా టాక్ ప్రకారం ఇండిపెండెన్స్ డే వీకెండ్ టైంలో జైలర్ 2 విడుదలకు ప్లాన్ చేస్తున్నారని వార్తలు వస్తుండగా.. మేకర్స్ నుంచి క్లారిటీ రావాల్సి ఉంది. సీక్వెల్‌లో బాలీవుడ్ భామ విద్యాబాలన్‌తోపాటు కోలీవుడ్ యాక్టర్ సంతానం కీలక పాత్రల్లో నటిస్తున్నారని తెలుస్తుండగా.. మరి రాబోయే రోజుల్లో ఈ స్టార్ యాక్టర్లపై అఫీషియల్ అప్‌డేట్ రావాల్సి ఉంది. జైలర్ ఫస్ట్ పార్టులో రమ్యకృష్ణ, వినాయకన్, వసంత్ రవి, మోహన్ లాల్, శివరాజ్ కుమార్, తమన్నా కీలక పాత్రల్లో నటించారని తెలిసిందే. సీక్వెల్‌లో ఎవరెవరుండబోతున్నారన్నదానిపై మేకర్స్ నుంచి క్లారిటీ రావాల్సి ఉంది. సీక్వెల్‌లో శివరాజ్‌కుమార్, మోహన్ లాల్ పాత్రలు రిపీట్ కానున్నాయని ఇప్పటికే వార్తలు వచ్చాయి. మరోవైపు తాజాగా బాలీవుడ్ బాద్ షా షారుక్ ఖాన్ ఇందులో కీలక పాత్రలో నటిస్తున్నాడని అప్‌డేట్ కూడా వచ్చింది.



# టోవినో థామస్ 'పళ్లిచట్టంబి' ట్రైలర్ వచ్చేసింది

టోవినో థామస్ కథానాయకుడిగా డిజో జోస్ ఆంటోనీ దర్శకత్వంలో రూపొందుతున్న భారీ బడ్జెట్ చిత్రం 'పళ్లిచట్టంబి'. తాజాగా విడుదలైన ఈ సినిమా తెలుగు ట్రైలర్ ప్రేక్షకులలో ఆసక్తిని రేకెత్తిస్తోంది. పీరియడ్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమా నుంచి ట్రైలర్ విడుదలైంది. దీంతో టోవినో థామస్ ఫ్యాన్స్ సంబరాలు చేసుకుంటున్నారు.

ట్రైలర్ ప్రారంభంలోనే ఒక శక్తివంతమైన వ్యక్తి రాక గురించి చెప్పే డైలాగులు సినిమా తీవ్రతను చాటుతున్నాయి. "అతడు వస్తున్నాడు.. ఈ భూమిని దహించి బూడిద చేసే వరకు అతడు ఆగడు" అనే హెచ్చరికతో కథలో ఉన్న ఉత్కంఠను పరిచయం చేశారు. కేరళలోనే అత్యంత కరుడుగట్టిన, ధైర్యవంతుడైన వ్యక్తి కోసం జరిగే అన్వేషణ, అతడిని తీసుకువచ్చి 'క్రిస్టోఫర్'గా నిలబెట్టడం వంటి అంశాలు కథలో కీలక మలుపులుగా కనిపిస్తున్నాయి.

మలయాళ స్టార్ హీరో టోవినో థామస్ ఈ చిత్రంలో అత్యంత పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తున్నారు. ట్రైలర్‌లో ఆయన లుక్, బాడీ లాంగ్వేజ్ మరియు డైలాగ్ డెలివరీ అద్భుతంగా ఉన్నాయి. ముఖ్యంగా "నేను వస్తున్నాను.. ప్రకాశవంతమైన రావణుడిని!" అని ఆయన చెప్పే డైలాగ్ సినిమాపై అంచనాలను పెంచేసింది. ఒక గ్రామాన్ని కాపాడే రక్షకుడిగా, శత్రువుల పాలిట యముడిగా ఆయన పాత్ర రెండు విభిన్న కోణాల్లో సాగుతుందని అర్థమవుతోంది.

దర్శకుడు డిజో జోస్ ఆంటోనీ గత చిత్రాల మాదిరిగానే, ఈ సినిమాలో కూడా సామాజిక అంశాలతో కూడిన భారీ యాక్షన్ సీక్వెన్స్‌లను ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. ట్రైలర్‌లో కనిపించే విజువల్స్, ముఖ్యంగా రాత్రి సమయాల్లో చిత్రీకరించిన యాక్షన్ ఘట్టాలు మరియు బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమా స్థాయిని పెంచాయి. "కున్నంపురం అనే గ్రామాన్ని రక్షించుకోవడానికి అదే భూమిని ఆయుధంగా మార్చుకుంటాం" అనే ముగింపు డైలాగ్ సినిమాలో భూమికి, ప్రజలకు ఉన్న అనుబంధాన్ని ఎమోషనల్‌గా ఆవిష్కరించింది.

సినిమా అంతా కున్నంపురం అనే ప్రాంతం చుట్టూ తిరుగుతుంది. ఆ గ్రామాన్ని నాశనం చేయాలని చూసే దుష్టశక్తులను హీరో ఎలా ఎదిరించాడు? అసలు ఆ గ్రామానికి, హీరోకి ఉన్న సంబంధం ఏంటి? అనే ప్రశ్నలకు సమాధానం వెండితెరపై చూడాల్సిందే. మొత్తానికి 'పళ్లిచట్టంబి' ట్రైలర్ తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా ఉంది. టోవినో థామస్ నటన, భారీ నిర్మాణ విలువలు, ఆసక్తికరమైన నేపథ్యం వెరసి ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి విజయం సాధించే అవకాశాలు కనిపిస్తున్నాయి. పీరియడ్ సినిమాలను, యాక్షన్ డ్రామాలను ఇష్టపడే వారికి ఈ చిత్రం ఒక మంచి విందు కానుంది.





# కింగ్ ఖాన్ హాలీవుడ్ ఎంట్రీ?..

## 'ది వైట్ లోటస్' వెబ్ సిరీస్‌లో షారూఖ్.!



ప్రముఖ హాలీవుడ్ వెబ్ సిరీస్ 'ది వైట్ లోటస్' మూడో సీజన్ గురించి సోషల్ మీడియాలో ఒక ఆసక్తికరమైన వార్త ప్రస్తుతం వైరల్‌గా మారింది. బాలీవుడ్ బాద్‌షా షారూఖ్ ఖాన్ ఈ క్రేజీ సిరీస్‌లో నటించబోతున్నారంటూ నెట్టింట పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. హెచ్‌బీఓ ఛానెల్‌లో అత్యంత పాపులర్ అయిన డార్క్ కామెడీ డ్రామా సిరీస్ 'ది వైట్ లోటస్'. దీని మూడో సీజన్ చిత్రీకరణ థాయ్‌లాండ్‌లో జరుగుతోంది. అయితే, ఈ సిరీస్ నుంచి బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకోనే తప్పుకుందనే వార్తలు వచ్చిన కొద్ది రోజులకే.. ఆ స్థానంలోకి షారూఖ్ ఖాన్ రాబోతున్నారంటూ ఊహాగానాలు మొదలయ్యాయి. అయితే ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. షారూఖ్ ఖాన్ ప్రస్తుతం తన సొంత భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నాడని. హాలీవుడ్ షోలలో నటించే ఆలోచన ఆయనకు ప్రస్తుతానికి లేదని వెల్లడించినట్లు తెలుస్తుంది. మరోవైపు 'ది వైట్ లోటస్' టీమ్ గానీ, షారూఖ్ మేనేజ్‌మెంట్ గానీ ఈ వార్తలపై ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.

# ప్రతిదీ ప్రేమ కాదు.. త్రిష

సినిమాలకు అతీతంగా నటి త్రిష కొన్ని రోజులుగా వార్తల్లో నిలుస్తున్న సంగతి తెలిసిందే. ఓ నటుడితో కలిసి వేడుకకు వెళ్లడం తమిళనాడు రాజకీయాల్లోనూ చర్చనీయాంశమైంది. ఈ క్రమంలో ఎన్నో రూమర్లు వచ్చాయి. ఊహాగానాలు ఇంకా వస్తూనే ఉన్నాయి. ఈ క్రమంలో ప్రేమకు సంబంధించిన ఓ కోట్‌ను త్రిష పోస్టు చేశారు. "ప్రతిదీ ప్రేమ కాదు. కానీ, ప్రేమ లేకపోతే దేనికీ అర్థం లేదు" అని ఉన్న ఫొటోను షేర్ చేస్తూ 'ఫ్యాక్ట్' (వాస్తవం) అని పేర్కొన్నారు. సినిమాల విషయానికొస్తే.. త్రిష రెండు దశాబ్దాలకుపైగా హీరోయిన్‌గా రాణిస్తుండటం విశేషం. సూర్య సరసన నటించిన 'కరుప్పు' (తెలుగులో వీరభద్రుడు) మే 14న విడుదల కానుంది. చిరంజీవితో కలిసి నటించిన 'విశ్వంభర' రిలీజ్‌కు సిద్ధమవుతోంది. మోహన్‌లాల్‌తో కలిసి యాక్ట్ చేసిన 'రామ్' మూవీ పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1,
BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com